
అమరావతి చిత్ర కళా వీధిలో.. ఓ అపురూపం!

# అద్భుతః

- అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన
- వందలాది పెయింటింగ్స్, ఆకృతులు
- పెన్సిల్ ఆర్ట్ నుంచి సిలికాన్ విగ్రహాల వరకూ
- పలు రాష్ట్రాల నుంచి కళాకారులు
- కళలకు పునరుజ్జీవం : డిప్యూటీ స్పీకర్ రఘురామ
- కళాకారులకు పూర్వ వైభవం : మంత్రి దుర్గేష్

6

కళాకారుల సృజనాత్మకత కుంచెగా మారి జాలువారిన చిత్రాలు, ఆలోచనలకు రూపమిచ్చిన ఆకృతులతో, ఒడుపుగా రావి ఆకులో ఇమిడ్చిన స్వతంత్ర సమరయోధుల చిత్రాలు, కోడిగుడ్డు గుల్లలు, వేరుశనగ తొక్కలు.. ఇలా ఒకటేమిటి.. ఎన్నెన్నో వస్తువులతో జీవం పోసుకున్న కళారూపాలు.. మొత్తంగా అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన ఔరా! అనిపించింది. గోదావరి తీర నగరాన్ని పులకింపజేసింది. కళకు కాదేదీ అనర్హం అని నిరూపించింది. కళాకారులకు పూర్వ వైభవం తీసుకొచ్చే సదుద్దేశంతో రాష్ట్ర సాంస్కృతిక శాఖ రాజమహేంద్రవరంలో ఏర్పాటుచేసిన ఈ వేడుకలో కళాకారులు తమ కళాఖండాలను ప్రదర్శించారు.


ఇటీవల తాము వేసిన వేషధారణలతో వేసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న రఘురామకృష్ణంరాజు, దుర్గేష్, పక్కన ఎమ్మెల్యే ఆదిరెడ్డి, తేజస్వి


రాజమహేంద్రవరంలో.. చిత్రకళా వీధిలో..


అమరావతి చిత్రకళా వీధి కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ, మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి, బత్తుల, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు


చిత్రకళా వీధిలో ప్రదర్శనలు.. సెంట్రల్ జైలు స్టాల్ వద్ద స్వాగతం




తన రక్తంతో గీసిన పవన్ చిత్రాన్ని రఘురామకు చూపిస్తున్న ఆర్టిస్ట్

కళ.. కళాకారులు

# అయ్యో.. రొయ్యో..!




ఆక్వా చెరువులు... వనామీ రొయ్యలు పడుతున్న దృశ్యం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆక్వా రైతుల్లో వణుకు పుట్టిస్తున్నాడు. భారత్ సహా వివిధ దేశాల నుంచి అమెరికాకు ఎగుమతి సుంకాలు భారీగా పెంచుతున్నట్టు చేసిన ప్రకటనతో రొయ్యల ఎగుమతిదారులు కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేశారు. దాని ఫలితంగా ఆక్వా రైతులు పండించే ఉత్పత్తులపై తీవ్రమైన ప్రభావం పడింది. ఉత్పత్తి అయ్యే రొయ్యలను సైతం ఎగుమతిదారులు ధరలు తగ్గించి కొనుగోలు చేసే ప్రతిపాదనలు రైతులకు శరాఘాతంగా మారింది. ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే ఎగుమతి సుంకాలు పెంచేశారన్న ప్రచారం ప్రభావంతో భారత్‌లోనే అత్యధిక ఆక్వా ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉండే ఆంధ్రప్రదేశ్‌లో కొనుగోళ్లు నిలిపివేయడం వల్ల ధరలు గణనీయంగా తగ్గిపోయి రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. 50 కౌంట్ నుంచే అమెరికాకు రొయ్యల ఉత్పత్తుల ఎగుమతులు జరుగుతుంటాయి. అయితే దీన్ని సాకుగా తీసుకుని వంద కౌంట్ రొయ్యల ధరను భారీగా తగ్గించేశారు. కొన్ని రోజులపాటు ఆక్వా రైతులు, ఉత్పత్తులను పట్టుబడులు చేయడం నిలిపివేయాలంటూ కంపెనీలు ఆదేశించడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. అమెరికా సుంకాల భారాన్ని మోపడంపై వారంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

(అమలాపురం/మలికిపురం-ఆంధ్రజ్యోతి)

భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ముఖ్యంగా వనామీ రొయ్యపై ఎగుమతి సుంకం విధించడంతో ఆక్వా రైతులు పండించే రొయ్యల ఉత్పత్తులను కొన్నిరోజులపాటు నిలిపివేయాలన్న ఎగుమతిదారుల నిర్ణయం రైతులకు తీవ్ర ఆందోళన కలిగించింది. దాంతో కిలో రొయ్యలకు రూ.40 వరకు ఎగుమతి సుంకం పడుతుందనే పేరుతో రొయ్యల కొనుగోళ్లు నిలిపివేశారు. ఏప్రిల్ 15 నుంచి రొయ్యల ధరలు మరింత తగ్గుతాయనే ప్రచారానికి తెర లేపారు. దాంతో రొయ్యల రైతులు ఉత్పత్తి అయిన వాటిని అయిన కాడికి అమ్ముకోవడానికి సిద్ధమయ్యారు. వ్యాపారులు మాత్రం సిండికేట్ అయి నోరు మెదపడం లేదు. ఆర్డర్లు చెప్పడం లేదు. దాంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆక్వా రైతుల్లో ఆందోళన నెలకొంది. అధిక సాగు ఉన్న కోనసీమలో తీరప్రాంత మండలాల నుంచి ప్రతీ రోజు వేలాది టన్నుల రొయ్యలు వివిధ కంపెనీలకు ఎగుమతి అవుతాయి. రాష్ట్రంలోనే పేరొందిన ప్రముఖ కంపెనీలు ఈ ప్రాంతం నుంచి రొయ్యల కొనుగోలు చేస్తాయి. ట్రంప్ పేరుతో తమపై ఎగుమతి సుంకం పడుతుందనే నెపంతో ఎగుమతిదారులు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారని, ప్రస్తుతానికి కొనుగోలు నిలిపివేసినట్టు చెబుతున్నారు. ప్రస్తుతానికి కిలోకు రూ.20 నుంచి రూ.30 వరకు తగ్గించి రొయ్యలు కొనుగోలు చేస్తున్నారు. ధరలు మరింత తగ్గుతాయని ప్రచారం చేస్తూ రైతులను మానసికంగా సిద్ధం చేస్తున్నారు. 30 నుంచి 50 పైకౌంటు రొయ్యలు మాత్రమే అమెరికా, జపాన్ వంటి ఇతర దేశాలకు ఎక్కువగా ఎగుమతులు అవుతాయి. అయితే 80 నుంచి వంద కౌంటు వరకు రొయ్యలు ఎగుమతులకు పనికిరావని సాకుచూపి రేటు భారీగా తగ్గించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం వంద కౌంటు రొయ్యలు రూ.220 ధరకు కొనుగోలు చేస్తుండగా, 90 కౌంట్ రూ.230, 80 కౌంట్ రూ.250, 70 కౌంట్ రూ.270, 60 కౌంట్ రూ.300, 50 కౌంట్ రూ.330, 40 కౌంట్ రూ.360, 30కౌంట్ రూ.450 ధరలు ఉండగా ఇవి మరింత దిగజారే అవకాశాలు ఉన్నాయని రైతులు తెలుపుతున్నారు. ప్రభుత్వం రొయ్యల రైతులకు భరోసా కల్పించాలని, అత్యధిక విదేశీ మారకద్రవ్యం ఆర్జించే పెద్ద రంగం ఆక్వా కాబట్టి ప్రభుత్వం ఆక్వా రైతులకు బాసటగా నిలబడాలని ఆక్వా అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు త్సవటపల్లి నాగభూషణం పేర్కొన్నారు. ప్రభుత్వం ఇస్తామన్న విద్యుత్ రాయితీలు వర్తింపచేయాలని, గత ప్రభుత్వంలో దారుణంగా పెంచిన రొయ్య ఫీడు ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కొనుగోలుదారులతో చర్చించి రొయ్యలు కొనే ఏర్పాట్లు చేయాలని కోరారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని ఆక్వా రైతుల్లోనూ ఇదే ఆందోళన నెలకొంది.

- ఆక్వా రంగంలో వణుకు పుట్టిస్తున్న ట్రంప్ ప్రకటన
- ఆక్వారైతు నెత్తిన ఎగుమతి సుంకం పిడుగు
- ఆ సాకుతో రొయ్యల కొనుగోళ్లు ఆపేసిన ఎగుమతిదారులు
- కొన్ని రోజులపాటు కొనుగోళ్లు నిలిపివేయాలని నిర్ణయం
- విలవిల్లాడుతున్న రైతులు

# ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు

- జిల్లాలో 404 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు: జేసీ
- కేశవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- హాజరైన జేసీ, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ నిశాంతి, చిత్రంలో తోట సుధీర్, వేగుళ్ల

మండపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): దాళ్వా సీజన్‌లో పండిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాలద్వారా కొనుగోలు చేసి 24గంటల వ్యవధి కంటేముందే ధాన్యం సొమ్ములు నేరుగా రైతు ఖాతాల్లోకి నగదును జమ చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి తెలిపారు. మండపేట మండలం కేశవరంలో శుక్రవారం రైతు భరోసా కేంద్రంవద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ సంస్థ చైర్మన్ తోట సుధీర్‌తో కలిసి ఆమె శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జేసీ మాట్లాడారు. రైతులు పండించే ధాన్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన అంచనాల మేరకు 1.50 లక్షల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేస్తామన్నారు. ఇదే అంశంపై ఎమ్మెల్యే వేగుళ్ల జోక్యం చేసుకుని ప్రభుత్వం పశ్చిమగోదావరి జిల్లాలో 6లక్షలు మెట్రిక్‌టన్నులు ధాన్యం కొనుగోలు చేస్తుంటే ఇక్కడ మాత్రం 1.50లక్షల మెట్రిక్ టన్నుల మాత్రమే కొనుగోలు టార్గెట్ ఇవ్వడం దారుణమన్నారు. అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతుల ధాన్యం బకాయిలు ఆరునెలలైనా కూడా చెల్లించేవారు కాదన్నారు. కూటమి ప్రభుత్వం 6నుంచి 24గంటల వ్యవధిలోనే రైతు ఖాతాలో నగదు జమ చేస్తామన్నారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ సుధీర్ మాట్లాడుతూ కోనసీమలో పండిన ప్రతిధాన్యం గింజను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో 144 వరకు మిల్లులు ఉన్నాయని వాటికి సంబంధించి బ్యాంకు గ్యారెంటీలు కూడా 69శాతం మేర ఉన్నాయని చైర్మన్ తోట అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వపాఠశాలలు 44,334 తోపాటు వసతిగృహాలు 3930 ఉన్నాయని, వాటిలో చదువుకునే విద్యార్థులం దరికీ సన్నబియ్యంతో భోజనం అందిస్తామన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్డీవో లఖిల, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారిణి ఎం.బాలసరస్వతి, డీఎస్‌వో ఉదయభాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, జిల్లా రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి,జిల్లా రైస్‌మిల్లర్ల అమలాపురం అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఎంపీపీ ఉండమట్ల వాసు, తహసీల్దార్ తేజేశ్వరరావు, ఏడీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## రూ.15.48లక్షల విలువైన బంగారం స్వాధీనం

లక్ష్మీపోలవరం చోరీ కేసును చేధించిన పోలీసులు

ఒక దొంగ అరెస్టు.. మరో దొంగ కోసం గాలింపు

7

## లారీ ఢీకొని అన్నదమ్ముల మృతి

గంగలకుర్రులో ఘోర రోడ్డు ప్రమాదం

7

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

- జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047కు అనుగుణంగా కుటుంబానికొక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా సంబంధితశాఖల అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. యువపారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కమిటీ చైర్మన్, కలెక్టర్ మహేష్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సీఎం చంద్రబాబు ఎంతో ముందుచూపుతో పారిశ్రామికాభివృద్ధే లక్ష్యంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా పలు పథకాలను అమలులోకి తీసుకువచ్చారన్నారు. గడిచిన త్రైమాసికంలో వివిధ పథకాల కింద 20 ప్రతిపాదనల్లో 19యూనిట్లకు రూ.2.65కోట్లకు కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. కోకో ఎక్స్‌పోజర్ సందర్శన కోసం ఏర్పాట్లు చేయాలన్నారు. కోకో పెన్మెంటేషన్ యూనిట్ ప్రతిపాదనలను సిద్ధపరచాలన్నారు. కోనసీమ ప్రాంత అభివృద్ధికి నాబార్డు, సిడ్బి గ్రామీణాభివృద్ధి, పశుసంవర్ధకశాఖలు సమన్వయంతో యూనిట్ల మంజూరుకు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ స్పష్టం చేశారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్, సేల్స్ ట్యాక్స్ తదితర రాయితీల కింద ప్రత్యేక విధివిధానాలను రూపొందించారన్నారు. 12వ డీఐఈపీసీ చేసిన తీర్మానాలపై తీసుకున్న చర్యలను జనరల్ మేనేజర్ వీకేపీ ప్రసాద్ సభ్యులకు వివరించారు. మాచవరంలో పల్ప్ ప్రాసెసింగ్ కేంద్రం వచ్చేనెలలో ప్రారంభమవుతుందన్నారు. మామిడికుదురు తదితర ప్రాంతాల్లో కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయన్నారు. కామన్ ఫెసిలిటీ కేంద్రాలు, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కంపెనీ ఏర్పాటుకు నియోజకవర్గానికి ఒకచోట భూసేకరణ చేపట్టామన్నారు. ఇప్పటివరకు నాలుగుచోట్ల భూములను ఎంపిక చేశామన్నారు. ఇంకులేషన్ కేంద్రాలు ఏర్పాటు ద్వారా కొబ్బరి ఉత్పత్తికి గరిష్ఠంగా రూ.25 లక్షల ఆర్థిక సహాయాన్ని కేంద్రం అందిస్తుందన్నారు. పీఎం విశ్వకర్మయోజన ద్వారా 3815 మందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి 350 యూనిట్లను రూ.3.25కోట్ల నిధులతో మంజూరు చేశామన్నారు. ఏకగవాక్ష విధానం ద్వారా పారిశ్రామిక అనుమతులకోసం 1718 దరఖాస్తులు స్వీకరించగా 1661 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. సమావేశంలో ఏపీ ఐఐసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, మత్స్యశాఖ జేడీ జీవీ శ్రీనివాసరావు, పరిశ్రమల కేంద్రం సహాయ సంచాలకుడు శివరామప్రసాద్, ఎల్డీఎం కేశవవర్మ, సిడ్బి ప్రోగ్రాం అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# అనధికార లేఅవుట్లపై చర్యలేవి

- ప్లాన్ అప్రూవల్ చేస్తే చర్యలు తప్పవు
- అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జేసీ నిషాంతి


ఈదరపల్లిలో కార్యదర్శుల శిక్షణలో మాట్లాడుతున్న జేసీ

అమలాపురం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో అనధికార లేఅవుట్లను గుర్తించామని, కార్యదర్శులు తీసుకున్న చర్యలు ఏంటని అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జేసీ టి.నిషాంతి ప్రశ్నించారు. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నియమ నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. అనధికార లేఅవుట్లలో ప్లాన్ అప్రూవల్ ఇవ్వడంతోపాటు పంచాయతీ, ప్రభుత్వ నిధులతో రోడ్లు వేయడం వంటి అంశాలపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఇకపై అటువంటి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోకుండా కార్యదర్శులు పనిచేయాలని సూచించారు. ఈదరపల్లిలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం అముడా చైర్మన్ స్వామినాయుడు ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పంచాయతీ కార్యదర్శులకు అనధికార లేఅవుట్లు, అనధికార భవన నిర్మాణాలపై తీసుకోవాల్సిన చర్యలపై నిర్వహించిన సమావేశంలో జేసీతోపాటు జిల్లా పంచాయతీ అధికారిణి డి.శాంతలక్ష్మి మాట్లాడారు. అముడా ఇప్పటికే లేఅవుట్‌దారులకు ఉపకరించేలా చర్యలు చేపట్టిందన్నారు. లేఅవుట్‌లో మెయిన్‌రోడ్డు 40 అడుగులు ఉండి పక్క రోడ్లను 30 అడుగులకు తగ్గించారన్నారు. దశాబ్దాల కాలం క్రితమే వేసిన అనధికార లేఅవుట్లలో గృహనిర్మాణాలు సైతం జరిగిపోయాయని, కొందరైతే లేఅవుట్ల చుట్టూ ప్రహరీలు నిర్మిస్తున్నారని, అయినా ఎందుకు వారికి నోటీసులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అముడా వచ్చిన తరువాత కూడా కార్యదర్శులు ప్లాన్ అప్రూవల్స్ ఇవ్వడం తగదన్నారు. అనధికార భవన నిర్మాణదారులు, లేఅవుట్‌దారులకు అముడా ఆధ్వర్యంలో నోటీసులు అందించాల్సి ఉంటుందన్నారు. ప్లానింగ్ ఆఫీసర్ సత్యంమూర్తి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. కార్యదర్శులు చర్యలు తీసుకోకపోవడంవల్లే అనధికార లేఅవుట్లు పెరిగిపోయాయన్నారు. ఎకరాకు రూ.90వేలు అముడాకు చెల్లించాల్సి ఉంటుందని, సామాజిక స్థలం పంచాయతీకి కేటాయిస్తారని, నిబంధనలు పాటించకపోవడంవల్ల సామాజిక స్థలం విడిచిపెట్టకుండానే లేఅవుట్ పూర్తి చేస్తున్నారన్నారు. సమావేశంలో ఏపీవో ఉమామహేశ్వరరావు, కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు పాల్గొన్నారు.

# జిల్లాలో ముగిసిన ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చేపట్టిన ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ శుక్రవారంతో ముగిసినట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, క్యాంపు ఆఫీసర్ వనుము సోమశేఖరరావు తెలిపారు. గతనెల 7న సంస్కృతం పేపరు మూల్యాంకనంతో ఈ ప్రక్రియను ప్రారంభించామన్నారు. విరామం లేకుండా 29రోజులపాటు 7200మంది సిబ్బందితో మూల్యాంకన ప్రక్రియ పూర్తి చేశామన్నారు. జిల్లాకు వివిధ ప్రాంతాలనుంచి 1,48,191 జవాబు పత్రాలు రాగా వాటిని మూల్యాంకనం చేశామన్నారు. మూల్యాంకన కేంద్రంలోనే స్కాన్ చేసి మార్కులను ఇంటర్మీడియట్ బోర్డుకు పంపించామన్నారు. రాష్ట్రంలో అన్నిస్పాట్ వాల్యుయేషన్ కేంద్రాల్లో మూల్యాంకన ప్రక్రియ పూర్తయిందన్నారు. ఈనెల 12న ఇంటర్ ఫలితాలు వెలువడే అవకాశం ఉందన్నారు.మార్కులు తక్కువ వచ్చిన విద్యార్థులు,పరీక్షలు తప్పిన విద్యార్థులు విజయానికి మళ్లీ కృషి చేయడంలో విద్యార్థులకు తల్లిదండ్రులు అండగా ఉండాలన్నారు.







# అద్భుతః





ఆర్ట్‌ని తిలకిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి

## 'అమరావతి చిత్రకళా వీధి'లో ఆకట్టుకున్న వందలాది పెయింటింగ్స్, ఆకృతులు

## పెన్సిల్ ఆర్ట్ నుంచి సిలికాన్ విగ్రహాల వరకు... చూసి ముగ్ధులైన ప్రజలు

రాజమహేంద్రవరం/సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శుక్రవారం జరిగిన 'అమరావతి చిత్రకళా వీధి' ప్రదర్శనకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి నుంచి కూడా కళాకారులు వచ్చారు. నగర కళాకారులతో పాటు కడప, శ్రీకాకుళం, విజయవాడ, తిరుపతి తదితర ప్రాంతాల వారు పెయింటింగ్స్, ఆకృతులను స్టాల్స్‌లో ఉంచారు. ప్రభుత్వాస్పత్రి దగ్గరనుంచి ఆర్ట్స్ కళాశాల వరకు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టాల్స్ ఎక్రిలిక్, వాటర్ కలర్, పెన్, పెన్సిల్, నిబ్ పెయింటింగ్స్, చెక్క, మట్టి, కాగితం, వాల్‌పుట్టీ తదితర ముడిసరుకులతో చేసిన బొమ్మలతో నిండిపోయాయి. చిరుధాన్యాలతో చేసిన ప్రధాని మోదీ, తిరుమల వేంకటేశ్వరుని చిత్రపటాలు, మనిషిని పోలిన మనిషి విగ్రహాలు ఆశ్చర్యపరిచాయి. మహిళా ప్రత్యేక కారాగారంలోని ఉత్పత్తులు, కేంద్ర కారాగారంలోని ఖైదీలు వేసిన గాంధీజీ తదితర పెయింటింగ్స్ ఆకర్షించాయి. కడపకు చెందిన ఈరయ్య యోగి వేమన యూనివర్సిటీలో పని చేస్తున్నారు. ఆయన ఇసుకతో చిత్రపటాలు తయారు చేశారు. పాండిచ్చేరికి చెందిన నూర్జహాన్ టైలరింగ్ షాపులు, వస్త్ర తయారీ మిల్లుల్లో వచ్చిన రద్దుతో చేతి సంచులు, మహిళలకు హ్యాండ్ బ్యాగ్స్ రూపొందించారు. తిరుపతికి చెందిన బి.అర్చన నిర్మల్ పెయింటింగ్‌తో ఆకట్టుకున్నారు. లైవ్ ఆర్ట్‌లో కళాకారులు అక్కడికక్కడే పెన్, పెన్సిల్‌తో చిత్రాలు వేసి ఇస్తుండడం చాలా మందిని ఆకర్షించింది. వారివారి చిత్రాలను వేయించుకుని మురిసిపోయారు. కొత్తపేటకు చెందిన రాజ్‌కుమార్ వడయార్ ఫ్యాబ్రిక్, సిలికాన్ మెటీరియల్‌తో చేసిన ప్రముఖుల విగ్రహాల వద్ద సెల్ఫీల హడావుడి కనిపించింది. ఆయన చేతిలో రూపుదిద్దుకున్న అంబేడ్కర్, రాజా రవి వర్మ, దామెర్ల రామారావు, ఆదికవి నన్నయ తదితర విగ్రహాలను జనం ఆశ్చర్యంగా తిలకించారు. పెయింటింగ్స్ ఆకృతుల ఖరీదు బాగా ఎక్కువగా ఉండడంతో చాలా మంది బేరమాడి వెనక్కు తగ్గారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కళాకారులను సత్కరించి... ఈ ప్రభుత్వం కళాకారులకు పూర్వవైభవం తీసుకొచ్చే దిశగా ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సుప్రసన్నశ్రీ చిత్రకళా ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్పీ నరసింహకిషోర్ బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించి ఎప్పటికప్పుడు తగు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 250 మంది సిబ్బంది, 6 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్లను భద్రతా ఏర్పాట్లకు వినియోగించారు.



## కళలకు పునరుజ్జీవం: శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు



రాజమహేంద్రవరం/సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కళలకు పునరుజ్జీవం దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని శాసనసభ ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన 'అమరావతి చిత్రకళా వీధి' ప్రదర్శనను ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రకాశనం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'చలనచిత్ర కళాకారులు కావచ్చు, నాటకరంగ కళాకారులు కావచ్చు.. కళాకారులంటే నాకు చాలా గౌరవం. అలాంటి ఈ శాఖకు దుర్గేశ్, తేజస్విలను ఎంపిక చేసిన రోజు కళలకు మంచి రోజులు వచ్చాయనే నమ్మకం కలిగింది. అది ఈ రోజు నిజమైంది. రానున్న రోజుల్లో వీరిద్దరి నాయకత్వంలో మరిన్ని గొప్ప గొప్ప కార్యక్రమాలు రాష్ట్రమంతా జరగాలి. కళాకారుల పట్ల ప్రజలకు ఉన్న అభిమానానికి ఇది మచ్చుతునకగా మిగిలింది. కళలను గౌరవించినచోట చక్కని వాతావరణం ఉంటుంది' అన్నారు. మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ... 'ఇవాళ చిత్రకళా వీధి అనే పేరుతో చైర్‌పర్సన్ తేజస్విని, మేము ఒక ఆలోచన చేశాం. ఇక్కడ లబ్ధ ప్రతిష్ఠులైన అనేక మంది కళాకారులు ఉన్నారు. కేవలం చిత్రలేఖనమే కాకుండా శిల్పాలు తయారు చేసే కళాకారులూ ఉన్నారు. వీటిని ప్రజలకు తెలియజేయడం ద్వారా ప్రజల్లో కళల పట్ల ప్రత్యేకమైన ఆసక్తి కల్పించాలని భావించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్విని, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డి.మల్లికార్జునరావు కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కాగా నిర్వాహకులను, అధికారులను, వలంటీర్లను మంత్రి దుర్గేశ్ ప్రత్యేకంగా అభినందించారు. కళాకారుల వద్దకు వెళ్లి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు.






మినియేచర్ ఆర్ట్‌ని భూతద్దంలో తిలకిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



చిత్రకళా వీధిలో ప్రదర్శనలను తిలకిస్తున్న జనం



తాను వేసిన చిత్రం గురించి చెప్తున్న కళాకారిణి



రాజాధిరాజ, రాజమార్తాండ.... ఆకట్టుకున్న చిత్రం



చిరుధాన్యాలతో ప్రధాని మోదీ చిత్రపటం



సొగసుచూడతరమా...



తమ ప్రాజెక్టులతో ప్రదర్శనకు వచ్చిన విద్యార్థులు



అచ్చుగుద్దినట్టు... పెన్సిల్ ఆర్ట్ కళాకారుల సందడి

### జై జవాన్... జై కిసాన్ నినాదంతో చిత్రాలు

**పి.రామారావు, బీఎస్ఎఫ్ జవాన్, ఛత్తీస్‌గఢ్ (స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా పలాస)**



దేశాన్ని ముందుకు నడిపించడంలో అత్యంత కీలకమైన రంగాలు వ్యవసాయం, రక్షణ. అందుకే రైతులు, జవాన్లతో చాలా సంవత్సరాలుగా పెయింటింగ్‌లు వేస్తున్నాను.

### చెక్కతో అనేక రకాల వస్తువులు

**మంజునాథ్, ఉడ్ కళాకారుడు, రామ్‌నగర్ జిల్లా, కర్ణాటక**



చెక్కతో అన్ని రకాల వస్తువులను తయారు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా జరిగే ఎక్స్‌పోలలో ప్రదర్శనలకు పెడుతున్నాం. కర్ణాటకు నుంచి ఆహ్వానించడం ఆనందంగా ఉంది.

### మేకతోలుతో కళాఖండాలు

**మురళి, కళాకారుడు, నిమ్మలకుంట, ధర్మవరం మండలం, శ్రీసత్యసాయి జిల్లా**



మేకతోలును ఇరవై రోజులు ప్రోసెస్ చేస్తే రూపం మారుతుంది. అప్పుడు తోలుబొమ్మ కళాఖండాలు తయారు చేస్తాను. టేబుల్ ల్యాంప్‌లు, వివిధ రకాల చిత్రాలు, తోరణాలు... ఇలా అనేక రకాల ఆకృతుల్లో పెయింటింగ్‌లు తయారు చేస్తున్నాం. మార్కెట్లో వీటికి డిమాండ్ అధికంగానే ఉంది.

### ప్రధాని మోదీ పిలుపుతో మిల్లెట్ చిత్రాలు

**మోకా విజయ్‌కుమార్, విశాఖపట్నం**



ప్రధాని నరేంద్రమోదీ పిలుపుతో మిల్లెట్స్ ప్రాధాన్యాన్ని పెంచుతూ పెయింటింగ్‌లు వేయడం మొదలుపెట్టాను. ఇప్పటికి ఆరు అరుదైన రికార్డులను కైవసం చేసుకున్నాను. న్యూఢిల్లీ, హైదరాబాద్, విశాఖపట్నం -జీ20లో ప్రదర్శనలు ఇచ్చాను.

### ఆదరణ బాగుంది

**బత్తుల అర్చన, చిత్రకారిణి, తిరుపతి**



ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్‌లో ఈ పెయింటింగ్ వేయడం మొదలు పెట్టాను. ఒక్కటి వేయడానికి రెండు రోజులు పడుతుంది. నా భర్త సహకారంతో 15 ఏళ్లుగా పెయింటింగ్‌లు వేస్తున్నాను. ప్రజాదరణ బాగుంది.

## నిండు గర్భిణి... అయినా అంతా తానై!

**రాష్ట్ర సృతజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్. తేజస్విపై ప్రశంసల జల్లు**

రాజమహేంద్రవరంలో తొలిసారిగా ఏర్పాటుచేసిన అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన ప్రశంసలు అందుకొంది. సుమారు 500 మంది కళాకారులు తమ పెయింటింగ్స్, ఆకృతులను ప్రదర్శించారు. ఈ నిర్వహణ ఒక్క రోజులో జరిగింది కాదు. ఎంతో కసరత్తు చేయడం వల్లే విజయవంతమైంది. దీని వెనుక ఒక మహిళ కృషిని అందరూ ప్రశంసిస్తున్నారు. ఆమే తేజస్వి పొడపాటి. రాష్ట్ర సృతజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్. ప్రస్తుతం ఏడో నెల గర్భవతి. సాధారణంగా విశ్రాంతి తీసుకునే సమయం. కానీ బాధ్యతలను విస్మరించలేదు. మండు టెండను సైతం లెక్కచేయకుండా కార్యక్రమ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. చాలా రోజులుగా అధికారులతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడు తూ సమన్వయం చేశారు. స్టాల్స్ ఏర్పాటు నుంచి వీఐపీల రాక వరకు అంతా తానై నడిపించారు. ఉదరంపై చేయి వేసుకుంటూ నెమ్మదిగా నడుస్తూనే అంతా చక్కబెట్టారు.



ప్రముఖ చిత్రకారుడు దామెర్ల రామారావు విగ్రహం వద్ద తేజస్వి




### రెండు తరాలుగా వేస్ట్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో....

**కాటూరి వెంకటేశ్వరరావు, శిల్ప కళాకారుడు, తెనాలి**



ఏడు తరాలుగా వంశపారంపర్యంగా విగ్రహాలు చేస్తున్నాము. గత రెండు తరాలుగా స్టెయిన్‌లెస్ స్టీల్ విగ్రహాలను తయారు చేస్తున్నాం. ఒక్కో విగ్రహం తయారీకి 45రోజులు నుంచి రెండు నెలలు పడుతుంది. కర్ణాటకలో పునీత్‌రాజ్‌కుమార్ విగ్రహాలు మేమే తయారు చేశాము.

### విగ్రహాలకు ప్రాధాన్యత పెరుగుతోంది

**రాజ్‌కుమార్ వడయార్, ప్రముఖ శిల్ప కళాకారుడు**

విగ్రహాలకు గతంలో కంటే ప్రాధాన్యత ఎక్కువైంది. మా పూర్వీకుల నుంచి నాకు ఈ కళ వారసత్వంగా వచ్చింది. ఇప్పటివరకు కొన్ని వేల విగ్రహాలను తయారు చేశాను.

### కనీసం మూడు రోజులు నిర్వహించాలి

**ఎ.శ్రీనివాస్, రాజమహేంద్రవరం**



ఈ ప్రదర్శన చాలా బాగుంది. పెయింటింగ్స్ అద్భుతంగా వున్నాయి. కనీసం మూడు రోజులైనా ఉంటే ఎక్కువ మంది చూసే అవకాశం ఉంటుంది.

### తెలియని వాటిని తెలుసుకున్నాం

**కృష్ణగౌతమ్, ఇంటర్ విద్యార్థి, రాజమహేంద్రవరం**



చాలా పెయింటింగ్స్ ఎలా వేస్తారో తెలియదు. అటువంటి వాటిని తెలుసుకున్నాను. వీటితో కూడా కళాఖండాలు తయారు చేయవచ్చా అనిపించింది.

### ఇటువంటి అద్భుత కళాఖండాలు చూడలేదు

**హర్షిణి, రాజమహేంద్రవరం**



ఈ ప్రదర్శనలో అద్భుతమైన కళాఖండాలు ఉన్నాయి. చిత్రకారులు గొప్పతనం వాటి తయారీ వెనుక కనిపిస్తోంది. వినియోగించి పడేసే సీసాలతో అద్భుత ఆవిష్కరణలు చేశారు. రావి ఆకుపై పెయింటింగ్స్ సూపర్.

### వేసవి సెలవుల్లో పెడితే బాగుండేది

**కె.భవాని, లాలాచెరువు**



ఇక్కడి చిత్రాలు చూడ్డానికే కాదు విజ్ఞానానికి కూడా దోహదపడతాయి. వేసవి సెలవుల్లో పెడితే పిల్లలందరూ చూసే అవకాశం ఉండేది.



వేస్ట్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహం

## రాములోరి కల్యాణానికి కంత సారె

### పి.గన్నవరంలో 16 ఏళ్లుగా శ్రీరామనవమికి తయారీ
### పట్టాభిరామస్వామి ఆలయంలో సీతమ్మవారికి
### సమర్పించనున్న భీమరాజు-సత్యవాణి దంపతులు



పాలకోవాతో తయారు చేసిన కంత సారె

పి.గన్నవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణానికి క్షత్రియ వివాహ సంప్రదాయాన్ని అనుసరించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం గ్రామానికి చెందిన పేరిచర్ల భీమరాజు-సత్యవాణి దంపతులు కంత సారె సమర్పిస్తున్నారు. వైనతేయ గోదావరి నదీ తీరాన వేంచేసియున్న పట్టాభిరామస్వామి ఆలయంలో ప్రతిఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా స్వామి, అమ్మవార్ల కల్యాణానికి కంత సారె సిద్ధం చేశారు. వరుడు (రాముడు) తరఫున వధువు (సీతమ్మతల్లి)కి పాలకోవతో తయారు చేసిన సుమారు 108 రకాల స్వీట్లు, పిండి వంటలు సమర్పించనున్నారు. నవమికి 15 రోజులు ముందు నుంచీ సుమారు 200 లీటర్ల పాలతో తయారు చేసిన కోవాను ఉపయోగించి పంచె, చీర, పర్ణశాల, వివిధ రకాల పండ్లు, కాయలు, వస్తువుల ఆకారాలు, గోవిందనామం, పల్లకి, శంఖు, చక్రాలను అందంగా తీర్చిదిద్దారు. ఇవే కాకుండా వివిధ రకాల పిండి వంటలను కూడా అధిక మొత్తంలో సిద్ధం చేశారు.

పట్టాభిరామస్వామి ఆలయానికి 70 ఏళ్ల చరిత్ర ఉంది. 16 ఏళ్లుగా మా కాలనీలోని మహిళల సహకారంతో స్వామివారి తరఫున అమ్మవారికి కంతసారె అందిస్తున్నాము. మొదట చిన్నగా ప్రారంభించి ప్రస్తుతం భారీ స్థాయిలో తయారు చేస్తున్నాం. కల్యాణం అనంతరం ఆలయానికి వచ్చే భక్తులకు సారెను పంచుతాం. **- సత్యవాణి**



## భద్రాద్రి రాములోరి కల్యాణానికి మండపేట బొండాలు

**25ఏళ్లుగా అందజేస్తున్న రామారెడ్డి దంపతులు**

మండపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో జరిగే సీతారామచంద్రుల కల్యాణానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన కేవీ రామారెడ్డి దంపతులు కొబ్బరి బొండాలు తయారు చేశారు. వీటితో పాటు కర్పూర దండలు, తలంబ్రాలు పోసుకునే కొబ్బరి కురిడీలను కూడా అందజేస్తున్నామని ఆయన తెలిపారు. ఒంటిమిట్టలో ఈ నెల 11న జరిగే సీతారాము కల్యాణానికి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని గొల్లల మామిడాడ రామాలయం, వాడపల్లి వేంకటేశ్వరస్వామి కల్యాణం, రామతీర్థంతో పాటు పలు రామాలయాల్లో జరిగే కల్యాణోత్సవాలకు కొబ్బరిబొండాలను తయారు చేసి పంపిస్తున్నామని రామారెడ్డి చెప్పారు. బొండాలను శుక్రవారం ఆయన ఇంటిలోని సీతారాముల విగ్రహాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. వీటిని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చూసి రామారెడ్డి దంపతులను అభినందించారు.



కొబ్బరి బొండాలు తయారు చేసిన రామారెడ్డి దంపతులు



# మృత్యువుతో పోరాడి.. ఓడి..

ఫార్మాసిస్ట్ నాగాంజలి మృతి

- కిమ్స్ బొల్లినేని ఉద్యోగి లైంగిక వేధింపులతో ఆత్మహత్యాయత్నం
- 13 రోజులు వైద్య చికిత్స
- రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో పోస్టుమార్టం, కుటుంబీకులకు అప్పగింత
- నాగాంజలి తండ్రికి వివిధ రాజకీయ పార్టీల నాయకుల పరామర్శ

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఒక్కగానొక్క కూతురు ... 12 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత పుట్టిన బిడ్డ. పేద కుటుంబమైనా ఎంతో అపురూపంగా చూసుకుని ఉన్నత చదువుల కోసం తపన పడి పట్టణం పంపిన ఆ తండ్రికి కుమార్తె మృతి తీవ్ర దుఃఖాన్ని మిగిల్చింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి ఉద్యోగి లైంగిక వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఫార్మాసిస్ట్ నల్లపు నాగాంజలి శుక్రవారం మృతిచెందింది. 13 రోజుల సుదీర్ఘ వైద్యచికిత్స అనంతరం తెల్లవారుజామున తుది శ్వాస విడిచింది. ఈ మేరకు నాగాంజలి మృతదేహానికి రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. పోస్టుమార్టం అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో ప్రైవేట్ అంబులెన్సులో స్వగ్రామమైన ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం గ్రామానికి తరలించారు. నాగాంజలి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం, చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన అత్యంత సున్నితం కావడంతో ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రికి వచ్చారు. నాగాంజలి తండ్రి దుర్గారావును పరామర్శించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన పార్టీ నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, ఐద్వా, మహిళా సంఘం నాయకులు తులసి, లావణ్య, ఇతర విద్యా, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వ బోధనాసుపత్రికి చేరుకున్నారు. నాగాంజలి మృతదేహాన్ని అంబులెన్సులో తరలించే సమయంలో వామపక్షపార్టీల నాయకులు అరుణ్, మధు తదితరులు తీవ్ర నిరసన తెలిపారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



నాగాంజలి మృతదేహాన్ని అంబులెన్సులోకి ఎక్కిస్తున్న దృశ్యం

### పుట్టెడు దుఃఖంలో తండ్రి దుర్గారావు



చెట్టుకింద దిగాలుగా కూర్చున్న దుర్గారావు

ఆసుపత్రి వద్ద నాగాంజలి తండ్రి దుర్గారావు పరిస్థితి చూస్తే ఎవరికైనా కన్నీళ్లు పెట్టించకమానవు. నోటమాట రాని పరిస్థితుల్లో దిగాలుగా, దైన్యంగా ఎవరికీ చెప్పుకోలేక, బాధ ఆవేదనలను తనలోనే దిగమింగుకోలేని నిస్సహాయపరిస్థితుల్లో ఆసుపత్రి పోలీస్ అవుట్‌పోస్టు వద్ద నున్న చెట్టు కింద వేదనతో కూర్చోవడం అందరినీ కలచివేసింది. కూతురి మృతదేహానికి పోస్టుమార్టం జరుగుతుంటే తనవారెవరూ తోడు లేని పరిస్థితుల్లో దుర్గారావు తానొక్కడే మౌనంగా రోదిస్తూన్న స్థితి అత్యంత దయనీయంగా కనిపించింది. ఎవరెవరో నాయకులు రావడం, పరామర్శించడం, సంఘ పెద్దలు తోడుగా నిలవడం ... అవన్నీ దుర్గారావుకు కలగానే మిగులుతాయా అన్నట్టుగా అక్కడి పరిస్థితులు మారాయి.

#### నిందితుడిని కఠినంగా శిక్షించాలి

మా పాపకు జరిగిన అన్యాయం ఏ పాపకూ జరగకూడదు. వాడిని కఠినంగా శిక్షించాలి, ఏమైనా సరే నిందితుడిని కఠినంగా శిక్షించాల్సిందే. ఇది మా కోరిక. ప్రభుత్వం తరఫున మాకు అన్ని సహకారాలు అందుతున్నాయి. మా సంఘం తరఫున కూడా మంచిగానే చూస్తున్నారు అని నాగాంజలి తండ్రి దుర్గారావు తెలిపారు.

## డిప్యూటీ సీఎం ఆదేశాలతో...

### నాలుగు దశాబ్దాల సమస్యకు పరిష్కారం



పిఠాపురంలో ఎల్‌పీసీలు అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

పిఠాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా పిఠాపురంలోని రథాలపేటలో ఉంటున్న తమకు ఇళ్ల పట్టాలులేవని అక్కడ ప్రజలు ఆ ప్రాంతంలో పర్యటించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకురావడంతో సమస్యకు పరిష్కారం లభించింది. పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న 15మందిని గుర్తించి వారికి రెవెన్యూ అధికారులు ఎల్‌పీసీలు జారీ చేశారు. శుక్రవారం కాకినాడ జిల్లా పిఠాపురంలో లబ్ధిదారులకు ఎమ్మెల్సీ నాగబాబు ఎల్‌పీసీ లు అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ పవన్ రథాలపేటలో పర్యటించినప్పుడు సమస్యలు తెలియజేయగానే కుళాయి వేయించి తాగునీటి సమస్య పరిష్కరించారని, ఇప్పుడు పట్టాలు అందజేశారని తెలిపారు. అంతకుముందుకు సాంఘిక సంక్షేమశాఖ బాలికల సమీకృత వసతి గృహంలో రూ.36.5లక్షలతో నిర్మించిన ఆధునీకరణ పనులను, పాదగయ ఎదురుగా జేజీఆర్ గ్రూపు నిర్మించిన బస్‌షెల్టర్‌ను నాగబాబు ప్రారంభించారు. వసతిగృహంలో బాలికలతో ముచ్చటించారు. వసతులు, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. కార్యక్రమంలో శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌హన్, ఎస్పీ బిందుమాధవ్, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, భీమిలి జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ ఉన్నారు.

### సోదరుడి పిండ ప్రదానానికి పయనమై

## ప్రాణాలు విడిచిన సోదరులు

● లారీ ఢీకొని అన్నదమ్ముల మృతి ● గంగలకుర్రులో విషాదంలో మరో విషాదం



ఘటనా స్థలం వద్ద సోదరులను ఆసుపత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

అంబాజీపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సోదరుడు మృతితో ఆ ఇంట్లో విషాదం నెలకొన్న పది రోజులకే మరో విషాదకరమైన ఘటన జరిగింది. సోదరుడు దశదిన కర్మ కార్యక్రమాలు నిర్వహించి పిండ ప్రదానానికి మోటార్‌సైకిల్ పై వెళ్తున్న అన్నదమ్ములను లారీ మృత్యు రూపంలో కబళించింది. ఒకరు సంఘటనా స్థలంలోనే మృతిచెందగా మరొకరు చికిత్స పొందుతూ మృతిచెందారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు గ్రామానికి చెందిన మంగిపూడి సూర్యనారాయణ గత నెల 24న మృతిచెందాడు. అతడి దిన కార్యక్రమాన్ని సోదరులు మంగిపూడి రామచంద్రరావు(67) మంగిపూడి నాగరాజు(64)లు శుక్రవారం ఇంటి వద్ద నిర్వహించారు. అనంతరం కర్మ కార్యక్రమాలు నిర్వహించి వాటిని కౌశికలో (గ్రామ శివారున ఓ కాలువ) కలిపేందుకు మోటార్‌సైకిల్‌పై అన్నదమ్ములు బయలుదేరివెళ్లారు. ఆ ఇంటికి సమీపంలోని గంగలకుర్రు ప్రాథమిక పాఠశాల నాలుగురోడ్ల జంక్షన్‌లోకి వచ్చే సరికి ముక్కామల నుంచి అంబాజీపేట వైపు అతివేగం, నిర్లక్ష్యంతో వెళ్తున్న లారీ మోటార్‌సైకిల్‌ను బలంగా ఢీకొంది. దీంతో నాగరాజు తలకు తీవ్రగాయాలు, రామచంద్రమరావుకు బలమైన గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్ ద్వారా అమలాపురం ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో నాగరాజు మృతిచెందగా రామచంద్రరావు చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాగరాజుకు భార్య, కుమారుడు ఉన్నారు. నాగరాజు విజయవాడలో చార్టర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య ఇన్‌కంట్యాక్స్ కార్యాలయంలో అధికారిగా పనిచేస్తున్నారు. కాగా రామచంద్రరావుకు వివాహం కాలేదు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ కె.చిరంజీవి పరిశీలించారు. దిన కార్యక్రమం జరిగిన రోజే మరో విషాదం జరగడంతో గంగలకుర్రులో విషాదచాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు రోదిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చిరంజీవి పేర్కొన్నారు.

### సెంట్రల్ జైలులో పరిచయం..

## ఇంటి తాళాలు బద్దలు కొట్టి దొంగతనం

ఒకరి అరెస్టు.. మరొకరి కోసం గాలింపు

రూ.15.48 లక్షల విలువైన 19 రకాల బంగారు ఆభరణాలు స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు, పోలీసు అధికారులు

అమలాపురం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ జైలులో ఉన్న సమయంలో ఏర్పడ్డ పరిచయంతో తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాలోని ఓ దొంగను పోలీసులు అరెస్టు చేసి అతడి నుంచి రూ.15.48 లక్షల విలువైన 19 రకాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్‌లు మాట్లాడారు. ఈ వివరాలను ఎస్పీ వెల్లడించారు. రావులపాలెం మండలం లక్ష్మీపోలవరం గ్రామంలో ఫిబ్రవరి 22వ తేదీన రాత్రి సమయంలో దొంగలు ఓ ఇంటి తాళాలు బద్దల కొట్టి బంగారు వస్తువులను భారీగా చోరీ చేశారు. వాటిని అమ్మే క్రమంలో పోలీసులకు పట్టుబడ్డారు. పి.గన్నవరం మండలం మానేపల్లి గ్రామానికి చెందిన ఉండి శివసుబ్రహ్మణ్యంతో పాటు సెంట్రల్ జైలులో పరిచమైన పందిరి వెంకటనారాయణ ఇద్దరూ కలిసి లక్ష్మీపోలవరంలోని ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. అయితే వాటిలో కొన్ని వస్తువులను అమ్మేందుకు ప్రయత్నిస్తున్న ఉండి శివసుబ్రహ్మణ్యంను రావులపాలెం జూనియర్ కళాశాల సమీపంలో గల సర్వీసు రోడ్డులోని ఖాళీ స్థలంలో ఉండగా పాత నేరస్థుడైన సుబ్రహ్మణ్యాన్ని అదుపులోకి తీసుకుని అరెస్టుచేశారు. అతడి నుంచి రూ.15.48లక్షలు విలువైన 172.661 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడైన పందిరి వెంకటనారాయణ కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. ఈ కేసును చేధించడంలో కీలకంగా పనిచేసిన రావులపాలెం సీఐ ఎం.శేఖర్‌బాబు ఆధ్వర్యంలోని పోలీసు సిబ్బందికి రివార్డులు అందించారు. దర్యాప్తులో సహకరించిన హెచ్‌సీ ఎస్.సత్యనారాయణ, కానిస్టేబుల్ పి.త్రిమూర్తులు, సీహెచ్ శ్రీనుబాబు, జి.కృష్ణసాయి, సుంకర బైసన్‌జీవన్‌కు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. రికవరీ చేసిన వస్తువులను డీఎస్పీ మురళీమోహన్ ప్రదర్శించారు.

## చీటీల సొమ్ముతో ఉడాయించిన మహిళ

రూ.1.40కోట్లు మేర మోసం

పిఠాపురం పోలీసులను ఆశ్రయించిన బాధితులు



పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధిత మహిళలు

పిఠాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): చీటీల సొమ్ముతో ఒక మహిళ ఉడాయించింది. మోసపోయిన బాధితులు శుక్రవారం రాత్రి కాకినాడ జిల్లా పిఠాపురం పోలీసుస్టేషన్‌కు తరలివచ్చి న్యాయం చేయాలని కోరారు. పిఠాపురంలోని కత్తులగూడెంకు చెందిన ఎం.కుమారి కొంతకాలంగా ప్రవేటుగా ఇంటి వద్ద చిట్‌ఫండ్ నిర్వహిస్తోంది. సుమారు 130 మంది వద్ద రూ.1.5లక్షల వంతున చీటీలు కట్టించుకుంది. అయితే కొంతకాలంగా చీటీల సొమ్ము సక్రమంగా చెల్లించకపోవడంతో మహిళలు ప్రశ్నించగా త్వరలోనే అందరికి సొమ్ములు చెల్లిస్తానని హామీ ఇచ్చింది. కొద్ది రోజులుగా ఆమె ఇంటి వద్ద కనబడకపోవడంతో మోసపోయామని గుర్తించిన మహిళలు శుక్రవారం రాత్రి పిఠాపురం పోలీసుస్టేషన్‌కు తరలివచ్చారు. సుమారు రూ.1.40 కోట్లు మేర చీటీల సొమ్ముతో కుమారి పరారయిందని మహిళలు తెలిపారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

### కొనసాగిన నాటికల పోటీలు

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.రాయవరంలో శ్రీరామచంద్ర నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐదోవ జాతీయస్థాయి నాటికల పోటీలు సందేశాత్మకంగా సాగుతున్నాయి. రెండోరోజు శుక్రవారం విశాఖపట్టణం తెలుగు కళాసమితి కళాకారులు ప్రదర్శించిన నీ ఖరీదెంత నాటిక, కొండెవరం మణికంఠ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన కొత్త తరం కొడుకుల నాటిక ఆకట్టుకున్నాయి.

## పెళ్లింట తీవ్ర విషాదం

పెళ్లి షాపింగ్‌కి వెళ్లి వస్తుండగా యువకుడి మృతి

లారీ ఢీకొనడంతో ప్రమాదం



చిక్కాల శ్రీను (ఫైల్)



మృతదేహం

జగ్గంపేట రూరల్/ గండేపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పెళ్లింట తీవ్ర విషాదం నెలకొంది. మరో 15 రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. పెళ్లి షాపింగ్ నిమిత్తం వెళ్లి తిరిగి వస్తుండగా మృత్యువు కాటేసింది. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన చిక్కాల శ్రీను (28)కు గోకవరం మండలం మల్లవరానికి చెందిన అమ్మాయితో పెళ్లి నిశ్చయమైనట్టు తెలిసింది. పెళ్లి షాపింగ్ నిమిత్తం శుక్రవార పెద్దాపురం వెళ్లి తిరిగి వస్తుండగా జగ్గంపేట మండలం కాట్రావులపల్లి భారత్ పెట్రోల్‌బంక్ వద్ద వెనుక నుంచి లారీ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న శ్రీను కిందపడగా తలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పెళ్లి పనుల్లో కుటుంబంతా సంతోషంగా ఉన్న సమయంలో ఈ విషయం తెలియగానే ఒక్కసారిగా కుప్పకూలారు. అప్పటివరకు బంధుమిత్రులతో సంతోషంగా ఉన్న కుటుంబీకులు, ఇరుగుపొరుగు వారు కన్నీరుమున్నీరయ్యారు. 4రోజుల కిందటే పసుపు కొట్టడం జరిగిందని, ఇంతలోనే మృత్యు ఒడిలోకి శ్రీను చేరడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. శనివారం పుట్టిన రోజు జరుపుకోవాల్సిన శివ అకస్మాత్తుగా కన్ను మూయడంతో కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు. శ్రీనుకు తండ్రి కాట మస్వామి, తల్లి సావిత్రి, సోదరి ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

## కూతురిపై అత్యాచారయత్నం

భార్య ఫిర్యాదుతో నిందితుడిపై కేసు నమోదు

కరప, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కూతురు వరసైన యువతిపై అత్యాచారయత్నానికి ఒడిగట్టిన ఉదంతం కాకినాడ జిల్లా కరప మండలం వేళంగి గ్రామంలో జరిగింది. కరప పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. వేళంగి గ్రామానికి చెందిన మండాది అమ్మాజీకి ఒక అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. అమ్మాజీ సోదరి చనిపోవడంతో 27ఏళ్ల ఆమె కూతురిని చేరదీసి తన ఇంట్లో ఉంచుకుంది. కాగా ఈనెల 3వ తేదీన ఇంట్లో ఎవరూలేని సమయం చూసి అమ్మాజీ భర్త శ్రీనివాసు కూతురు వరస అయిన ఆ యువతిని బలత్కరించబోయాడు. దీంతో బెదిరిపోయిన ఆ యువతి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు అక్కడకు చేరుకుని తలుపులు కొట్టారు. విషయం బయటకు చెప్తే చంపేస్తానని సదరు యువతిని బెదిరించి అక్కడ నుంచి పారిపోయాడు. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన అమ్మాజీకి స్థానికులు జరిగిన విషయం చెప్పడంతో శుక్రవారం ఆమె కరప పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నిందితుడిపై ఎస్ఐ తోట సునీత అత్యాచారయత్నం కింద కేసు నమోదు చేసి బాధితురాలిని వైద్యపరీక్షల నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### వైసీపీ నుంచి సామర్లకోట చైర్‌పర్సన్ సస్పెండ్

సామర్లకోట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ చైర్ పర్సన్ జీ.అరుణను వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైసీపీ వ్యతిరేఖ కార్యకలాపాలకు చైర్‌పర్సన్ అరుణ పాల్పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు ఆ ఉత్తర్వుల్లో తెలిపారు. అలాగే సామర్లకోట మండలం జెడ్పీటీసీ ఎలిశెట్టి అమృత భర్త ఎలిశెట్టి సూర్యనారాయణ మూర్తిని కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.

## చమురు వినియోగంలో 3వ స్థానంలో భారత్

● ఆయిల్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ సలోమ యాండో

● జేఎన్టీయూకేలో పీపీ స్టూడెంట్ చాప్టర్ 13వ వార్షిక సమావేశం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యాండో, వీసీ ప్రసాద్, అతిథులు

జేఎన్టీయూకే, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భారతదేశం చమురు వినియోగంలో 3వ స్థానంలో ఉందని, ప్రపంచవ్యాప్తంగా 13.2 బీవోఈ (బ్యారెల్ ఆఫ్ ఈక్వివాలెంట్) వినియోగిస్తుండగా భారత్‌లో 4.7 బీవోఈ వినియోగిస్తున్నారని ఆయిల్ ఇండియా లిమిటెడ్ డైరెక్టర్ సలోమ యాండో అన్నారు. జేఎన్టీయూ వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో యూసీఈకే కెమికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్ విభాగాలలోని జేఎన్టీయూకే ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పెట్రోలియం ఇండస్ట్రీ (పీపీ) స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో 13వ వార్షిక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సలోమ యాండో, గౌరవ అతిథిగా ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, అతిథిగా పీపీ డైరెక్టర్ దేబ్ అధికారి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా జేఎన్టీయూకే పీపీ స్టూడెంట్ చాప్టర్ అధ్యాపక సలహాదారుడు ప్రొఫెసర్ కేవీ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సలోమ యాండో మాట్లాడుతూ భారతదేశంలో 26 అవక్షేపణా బేసిన్లు ఉండగా మొత్తం 3.36 మిలియన్ల చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో వ్యాపించి ఉన్నాయని తెలిపారు. వీసీ ప్రసాద్ మాట్లాడుతూ కెమికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్ విద్యార్థులు రాష్ట్ర, దేశ అవసరాల మేరకు ఇంధన వనరులను ఉత్పత్తి చేసేలా నూతన ఆవిష్కరణలను చేపట్టాలని సూచించారు. కార్లు, ద్విచక్ర వాహనాల ఉత్పత్తిలో భారతదేశం ఎంతో ముందుందన్నారు. దేశంలోని 11 విద్యాసంస్థల నుంచి వచ్చిన పీపీ స్టూడెంట్ చాప్టర్ ప్రతినిధులకు అతిథులు ప్లాగ్, బ్యాడ్జ్‌ను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.బాలకృష్ణ, స్వర్ణకుమారి, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, మాజీ వీసీ పద్మరాజు, పీపీ స్టూడెంట్ చాప్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిర్యానీ కోసం వెళ్లి...

బైక్ ఢీకొని యువకుడి మృతి

మరొకరికి తీవ్రగాయాలు

గండేపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బిర్యానీ తినేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. గండేపల్లి ఎస్ఐ శివనాగ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామానికి చెందిన బాడవుల కేదార్ మణికంఠ(21) రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. గురువారం రాత్రి తన స్నేహితులతో కలిసి కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం బిర్యానీ తినేందుకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా గండేపల్లి వచ్చేసరికి రాత్రి 9 గంటల సమయంలో ఎన్టీరాజాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మోటార్‌సైకిల్‌పై స్పీడ్‌గా రాంగ్ రూట్‌లో వచ్చి మణికంఠ బైక్‌ను ఢీకొన్నాడు. మణికంఠను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. మరో యువకుడు విష్ణువర్ధన్‌కు గాయాలయ్యాయి. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

### ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరేసుకున్న యువకుడు

కొవ్వూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడు ఉరేసుకున్నట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామానికి చెందిన మట్టా చంద్రరావు, భార్య కళావతికి కుమార్తె, కుమారుడు మట్టా చంద్రశేఖర్(23) ఉన్నారు. కుమార్తెకు వివాహం అయ్యింది. కళావతి హైదరాబాద్‌లో ఇంటిపని చేస్తుంది. చంద్రశేఖర్ ఏపీ ఫైబర్‌నెట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం చంద్రరావు పొలం వెళ్లి సాయంత్రం 6 గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంటి లోపలికి వెళ్ళి చూసేసరికి కుమారుడు చంద్రశేఖర్ ఫ్యాన్‌కు ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ వేగులయ్య కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. అసరాగా ఉంటాడనుకున్న కొడుకు ఉరేసుకుని మృతిచెందడంపై తండ్రి బోరున విలపించడం అందరిని కంటతడిపెట్టించింది.

### భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

ఏలేశ్వరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలంలోని కంబాలపాలెనికి చెందిన సిరిబోతుల లక్ష్మీ పార్వతి తర భర్త రామకృష్ణ కనిపించడం లేదని శుక్రవారం ఏలేశ్వరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్తను ఫారెస్టు అధికారులు చెట్లు కేసు విషయంపై రాజవొమ్మంగి అటవీ శాఖ కార్యాలయానికి పిలిపించారని అప్పటి నుంచి కనిపించడం లేదని తెలిపింది. భర్త ఆచూకీ కోసం న్యాయస్థానంలో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసినట్టు చెప్పింది.

## టిడ్కో అపార్ట్‌మెంట్ల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

● ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి ● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

పిఠాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): టిడ్కో అపార్ట్‌మెంట్ల సముదాయాల వద్ద ఉన్న సమస్యలన్నింటి యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ కుమార్ తెలిపారు. కాకినాడ పిఠాపురం గోర్స రోడ్డులో ఉన్న టిడ్కో అపార్ట్‌మెంట్లలో ఉన్న సమస్యలతో అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అజయకుమార్ శుక్రవారం సాయంత్రం అక్కడ పర్యటించారు. అపార్ట్‌మెంట్లవాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నిలిచిపోయిన వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను ప్రారంభించామని తెలిపారు. డ్రైన్ సమస్యలకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనరు కనకారావుకు సూచించారు. పైప్‌లైన్ల లీకేజీలకు మరమ్మతులు నిర్వహిస్తామని చెప్పారు. తక్షణం జంగిల్ క్లియరెన్స్ చేయిస్తామని తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద పిఠాపురంలోనే అధిక అక్యుపెన్సీ ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మున్సిపల్ మంత్రి నారాయణ సూచనలకనుగుణంగా జూన్ నాటికి 80వేల టిడ్కో గృహాలను లబ్ధిదారులకు నూరుశాతం అప్పగిస్తామని తెలిపారు. వివిధ కారణాలతో ఖాళీ అయిన 10వేల అపార్ట్‌మెంట్లును కేటాయించేందుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఆయన వెంట పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి, మున్సిపల్ కమిషనరు కనకారావు, జనసేన నాయకుడు పిల్లా శివశంకర్ ఉన్నారు.




పిఠాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ కుమార్

## వైసీపీ భూముల రీసర్వేకు మహిళ బలి

తనకున్న భూమి ఆన్‌లైన్‌లో మరొకరి పేరు ఉండడంతో మనస్తాపం

గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి



మరణించిన సురేఖ

అనపర్తి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గత పాలనలో వైసీపీ చేపట్టిన భూముల రీసర్వేలో జరిగిన అవకతవకలకు తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన మహిళ బలైపోయింది. అనపర్తి అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తికి చెందిన నల్లమిల్లి సురేఖ తండ్రి సబ్బెళ్ళ సుబ్బారెడ్డి తనకున్న రెండెకరాల పొలాన్ని కుమార్తె సురేఖ సహా నలుగురికి సమానంగా రాసి 2021లో రిజిస్ట్రేషన్ చేయించారు. ఇటీవల సుబ్బారెడ్డి పన్నులు చెల్లించేందుకు వెళ్లగా ప్రభుత్వ రికార్డులలో సురేఖ పేరున ఉండాల్సిన భూమి మరొకరి పేరుతో ఉండడంతో ఆమె మనస్తాపానికి గురైంది. దీంతో ఆమె గురువారం సాయంత్రం ఇంటిలో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో బంధువులు ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందింది. సురేఖ భర్త భక్తుడు రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

### ఘనంగా ఉమామల్లేశ్వరుని కల్యాణం

అల్లవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): దేవగుప్తం లోని ఉమాపార్వతీ మల్లేశ్వరాలయం వద్ద శివభక్తుల శివనామస్మరణల మధ్య శివపార్వతుల శాంతి కల్యాణం జరిగింది. మరువాడ వెంకటేశ్వరశర్మ పర్యవేక్షణలో పోచినపెద్ది నరసింహమూర్తి బ్రహ్మత్వాన పోచినపెద్ది శ్యామ్‌శర్మ, వేదపండితులు ఉమామల్లేశ్వరుని కల్యాణం జరిపించారు.

### వైభవంగా రుద్రహోమం

ఐ.పోలవరం,ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ భద్రకాళీసమేతవీరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రుద్రహోమం నిర్వహించారు. చైత్రమాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా హోమం జరిగింది. అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆలయ సహాయకమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ

**జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వరరావు**

అమలాపురం రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యమవుతుందని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎక్కడికక్కడ నీరు నిల్వ ఉండిపోతే దోమలు వ్యాప్తి చెందడంతో పాటు పలురకాల వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందన్నారు. శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా బండారులంక



రెడ్డిపల్లిలో నూతి నీటిని పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు, సిబ్బంది

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్వీ రామారావు, హెల్త్ సూపర్‌వైజర్ డి.ఆనంద్‌శేఖర్, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రజ్యోతి, కె.విజయ, ఉప్పుగంటి బసవరాజు పాల్గొన్నారు. అదేవిధంగా పేరూరు పీహెచ్‌సీ పరిధిలోని పేరూరు-4 సచివాలయంలో వైద్య సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. గత ఏడాది వర్షాకాలం సీజన్‌లో కొంకాపల్లి ప్రాంతంలో డెంగ్యుజ్వరాలు ప్రబలిన నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. సబ్ యూనిట్ ఆఫీసర్ రామారావు, ఎంపీహెచ్‌ఈవో సత్యనారాయణ, కామేశ్వరరావు పాల్గొన్నారు.

## మండల సమావేశం.. ఎస్సీ వర్గీకరణపై నిరసన సెగ



ఎస్సీవర్గీకరణపై సర్పంచ్‌లు, ఎంపీటీసీల నిరసన

అల్లవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యిళ్ళ శేషగిరిరావు, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ పర్యవేక్షణలో శుక్రవారం మండలపరిషత్ సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణపై పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నిరసన తెలిపి సమావేశాన్ని బహిష్కరించారు. ప్లకార్డులతో ఎస్సీ వర్గీకరణ చేయవద్దంటూ నినాదాలు చేశారు. ముందుగా ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, తాగునీటి సమస్యలపై, చెత్త నుంచి సంపద తయారీపై మాట్లాడారు. ఈసందర్భంగా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తాము సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని సర్పంచ్‌ల సమాఖ్య నాయకులు సాధనాల వెంకట్రావు, దాకారపు చిరంజీవిరావు ప్రకటించారు. మాలలకు అన్యాయం చేస్తే సహించేది లేదని, వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పల్లి జేమ్స్‌రాజ్, సర్పంచ్‌లు రొక్కాల విజయలక్ష్మి, రాకాపు విజయలక్ష్మి, బొమ్ము బాలవేణి, వడ్డి గంగ, ఎంపీటీసీలు ముత్తాబత్తుల రాంబాబు, మాకే కృష్ణమూర్తి, పి.రాజేశ్వరి తదితరులు సమావేశాన్ని బహిష్కరించి మండల పరిషత్ గేటు వద్ద నిరసన తెలిపారు. అనంతరం ప్రభుత్వం ఎంపీటీసీలకు గౌరవ వేతనం ఇచ్చేవరకు ప్రభుత్వ కార్యక్రమాలను బహిష్కరిస్తామని ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు వద్ద సర్పంచ్‌లు కరాఖండిగా తెలిపారు.

### సామాజిక బాధ్యత పెంచాలి

అల్లవరం ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దైవారాధన విలువలతో పాటు సామాజిక స్పృహ పెంచాలని డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా అన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో విశ్వనాథ్ స్కూలు ముందంజలో ఉందని రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ అన్నారు. కరస్పాండెంట్ బూల లోక్‌నాథ్-వెంకటరమణి ఆధ్వర్యంలో జరిగిన తుమ్మలపల్లి విశ్వనాథ్ శాంతి విద్యానికేతన్ వార్షికోత్సవ సభలో శుక్రవారం రాత్రి వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులు, చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. డీఈవో, రూరల్ సీఐతో పాటు పలువురు ప్రముఖులను విశ్వనాథ్ దంపతులు సన్మానించారు. సర్పంచ్‌వడ్డి సుభాషిణి ఎలీషారాజ్, ఎంపీటీసీ పి.రాజేశ్వరిప్రమోద్, గునిశెట్టి చిన బాబు, పల్లి జేమ్స్‌రాజ్, నాతి శ్రీనివాసరావు, ఎస్ఐ టి.తిరుమలరావు, కాత్రు శాంతికిరణ్, విద్యార్థు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మామిడికుదురు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు పెరళ్ల కాల్వగట్టులో కోదండ రామాలయం వద్ద స్థానిక కోదండ రామా అభ్యుదయ యువజన సంఘం ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బత్తుల సత్యనారాయణమూర్తి దంపతులు కర్తలుగా పాల్గొని విగ్రహ ప్రతిష్ఠ చేశారు. సుదర్శనం వెంకటసుబ్రహ్మణ్యం ఆచార్యుల ఆధ్వర్యంలో పలుపూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం జరిగిన అన్నసమారాధనలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### చిత్రకళా ప్రదర్శనలో ఆకొండికి ప్రశంసలు



కాట్రేనికోన, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అమరావతి వీధి పేరుతో రాజమహేంద్రవరంలో జరిగిన జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శన సందర్భంగా కాట్రేనికోనకు చెందిన చిత్రకారుడు అంజి ఆకొండి అభినందనలు, ప్రశంసాపత్రం అందుకున్నారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఆకొండిని అభినందించారు. పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ తేజస్విని నుంచి అంజి ప్రశంసాపత్రం అందుకున్నారు.

## పోషకాహార మెరుగుదలకు పోషణ్ పక్వాడా

అమలాపురం టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, మహిళల పోషకాహార స్థితిలో మెరుగుదల సాధించడానికి ప్రధానమంత్రి పోషణ్ అభియాన్‌ను ప్రారంభించినట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. మహిళా శిశు అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో 7వ పోషణ్ పక్వాడా కార్యక్రమం ఈనెల8 నుంచి 22వరకు నిర్వహిస్తామని, అందుకు అవసరమైన చర్యలు లైన్ డిపార్టుమెంట్ అధికారులు చేపట్టాలని జేసీ ఆదేశించారు. కలెక్టరేట్‌లో డీఆర్డీఏ, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్యశాఖ సిబ్బందితో పోషణ్ పక్వాడా సన్నద్ధతపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో తీవ్రమైన పోషకాహార లో



మాట్లాడుతున్న జేసీ నిషాంతి

పంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక శ్రద్ధతో పోషణను అందించాల్సి ఉందన్నారు. గర్భిణులు, మహిళల పోషకాహార స్థితిపై పూర్తి అప్రమత్తతతో ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో పాటు ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి పాల్గొన్నారు.

## ప్రాథమిక విద్యార్థుల విజ్ఞాన విహారయాత్ర

అమలాపురం టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు సైన్స్ పట్ల ఆసక్తిని కల్పించేందుకు చేపట్టిన విజ్ఞాన విహారయాత్రను కలెక్టరేట్ వద్ద శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 132మంది ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు, 20మంది గైడ్ టీచర్లతో యాత్ర ప్రారంభమైంది. కలెక్టరేట్ వద్ద పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో తొలిరోజు యానాంలోని జిప్మెర్ వైద్యశాల, బొటానికల్ గార్డెన్స్‌ను సందర్శించారు. అనంతరం ఏటికొప్పాక బొమ్మల పరిశ్రమలను సందర్శించి వాటి తయారీ ప్రక్రియను, వాడే పదార్థాల వివరాలను విద్యార్థులు ఉత్సాహంతో తెలుసుకున్నట్టు జిల్లాసైన్స్‌అధికారి గిరజాల వీఎస్ సుబ్రహ్మణ్యం, సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు తెలిపారు.

### బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

రాజోలు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించామని ఎంపీడీవో డి.రాంబాబు తెలిపారు. రాజోలు, పొన్నమండ, కూనవరం, బి.సావరం, వేగివారిపాలెం, కడలి, ములికిపల్లి గ్రామాలకు చెందిన 519దరఖాస్తుదారులకు 368మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఈవోపీఆర్డీ ఎండీహెచ్ రెహ్మాన్, ఏవో ఎంవీ సత్యనారాయణ, సెక్రటరీలు సత్యప్రసాద్, ఎం.కృష్ణ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

## సాంకేతిక కార్యక్రమాలను రైతులు వినియోగించుకోవాలి

**ఎన్జీరంగా విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకుడు డాక్టర్ శివన్నారాయణ**

ముమ్మిడివరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఏరువాక కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న సాంకేతిక కార్యక్రమాలను రైతులు వినియోగించుకునేలా క్షేత్రస్థాయిలో అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్జీరంగా విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.శివన్నారాయణ పేర్కొన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని ఏరువాక కేంద్రంలో వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గిరిజారాణి అధ్యక్షతన శుక్రవారం జరిగిన రెండో జిల్లా స్థాయి సమన్వయం సంఘ సమావేశం శివన్నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏరువాక కేంద్రం ద్వారా జరుగుతున్న పరిశోధనలపై క్షేత్రస్థాయిలో రైతులు అవగాహన పెంపొందించుకునేలా చర్యలు



సదస్సులో మాట్లాడుతున్న ఎన్జీరంగా విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకుడు శివన్నారాయణ

తీసుకోవాలన్నారు. ఏరువాక కేంద్రం విధుల గురించి ఆయన వివరించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన గిరిజారాణి మాట్లాడుతూ ఏరువాక కేంద్రం చేపట్టే క్షేత్ర పరిశీలనలో శిక్షణ కార్యక్రమాల గురించి వివరించారు. జిల్లాలో ముంపును తట్టుకునే వరిరకాలు, సన్న వరి రకాలు,చౌడు భూముల్లో సాగుచేసే వరి రకాలు, వరిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముంపునకు తట్టుకునే వరిరకాలు గురించి చర్చించారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్ గత సంవత్సరం చేపట్టిన సాంకేతిక కార్యక్రమాలు, విస్తరణ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతులు నూతన వరి వంగడాలు, జీవన ఎరువుల వినియోగం, పురుగులు, తెగుళ్ల నివారణ గురించి పలు ప్రశ్నలువేసి సందేహాలు నివృత్తి చేసుకున్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి అమలుచేసే సాంకేతిక కార్యక్రమాలను ఖరారు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారులు, ఆత్మ పీడీ, ఉద్యానశాఖ అధికారి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం పశుసంవర్ధకశాఖ అధికారులు తమ నివేదికలను సభ్యులకు తెలియచేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## శ్రీకోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మురమళ్లలో కోటి రూపాయలతో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీహనుమత్సీతాలక్ష్మణసమేత శ్రీకోదండరామస్వామి, గణపతి, జ్ఞానసరస్వతి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సుదర్శనం వెంకటజనార్ధనాచార్యుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో నడింపల్లి చినవెంకట్రాజు, వెంకటసత్యసౌజన్య దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కార్యక్రమంలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, తాడి నరసింహారావు, నడింపల్లి సూర్యవర్మ, చెల్లి అశోక్, సాగిరాజు సూరిబాబురాజు, దాట్ల పృథ్వి, కాకర్లపూడి రాజేష్, జంపన బాబు, నడింపల్లి సోమరాజు, నడింపల్లి నాగబాబు, ఏలూరి సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

**నాగానందసరస్వతి అనుగ్రహ భాషణ**

శ్రీకోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో శృంగవృక్షం దత్త పీఠాధిపతి శ్రీ సాయిదత్త నాగానందసరస్వతి స్వామీజీ అనుగ్రహ భాషణంతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. రామాణయాన్ని మన నిత్య జీవితానికి ఎలా అన్వయించుకోవాలో వివరించారు. సీతారామచంద్ర పరివారానికి స్థానిక మురమళ్ళ వీరేశ్వరస్వామి దేవస్థానం అధికారులు ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు, యనమండ్ర సుబ్బారావు, నాగభట్ల రామకృష్ణమూర్తి, గంటి సుబ్రహ్మణ్యం, నాగభట్ల రవిశర్మ పాల్గొన్నారు.

### అంతర్వేది దేవస్థానం లీజు భూములు దుర్వినియోగం

**ఎమ్మెల్యే వరప్రసాద్**



అంతర్వేది, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది దేవస్థానం లీజు భూములు దుర్వినియోగం చెందుతున్నాయని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. పూర్వం నుంచి వెయ్యి ఎకరాల దేవస్థానం భూమిని లీజుకు తీసుకుని అతి తక్కువ లీజుతో పాతవారి దగ్గరే కొనసాగించడం, రికార్డుల దాఖలు-కట్టవలసిన శిస్తు రూ.2.55కోట్లు అయితే వసూలైంది మాత్రం రూ.33లక్షలు, ఇంకా రూ.2.15 కోట్లు బాకీ ఉందన్నారు. ఏటా రూ.50లక్షలు కట్టవలసిన శిస్తు అయితే పదేళ్లగా రూ.5కోట్లు ఉండాలి. వాటి వివరాలు చెప్పాల్సి ఉందన్నారు. 159ఎకరాలను అక్రమంగా రొయ్యల చెరువులుగా మార్చడం, లీజు అతితక్కువ వసూలు చేయడం, నోటీసులు ఇచ్చి కొత్తగా కౌలు ధరలు నిర్ణయిస్తామన్నారు. 46.56 ఎకరాల భూమిలో 595ఇళ్లు పూర్వం నుంచి కట్టుకుని నివశిస్తున్నారన్నారు. కాబట్టి క్రమబద్ధీకరణకు ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. అమలాపురం ఆర్డీవో వెంటనే వీటిపై విచారణ జరిపి కొత్తవారికి సరైన లీజు ధర నిర్ణయించి, రెవెన్యూ యంత్రాంగంతో బాకీలు వసూలు చేయించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

### జాబ్‌మేళాల క్యాలెండర్ ఆవిష్కరణ

అమలాపురం టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించి ఏడు నియోజకవర్గాల పరిధిలో నిర్వహించనున్న జాబ్‌మేళాల క్యాలెండర్‌ను, పోస్టర్‌ను శుక్రవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆవిష్కరించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరిశేషు మాట్లాడుతూ ఏప్రిల్ 17న పి.గన్నవరం నియోజకవర్గంలో, మే 2న మండపేట నియోజకవర్గంలో, మే 16న కొత్తపేట నియోజకవర్గంలో, 23న ముమ్మిడివరం నియోజకవర్గంలో, జూన్ 6న రాజోలు నియోజకవర్గంలో, 13న రామచంద్రపురం నియోజకవర్గాల్లో జాబ్‌మేళాలు నిర్వహించడానికి కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం



అగ్నిప్రమాద బాధితులకు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

**వక్కలంకలో రెండు తాటాకిళ్లు దగ్ధం**

అంబాజీపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్‌పేలడంతో రెండు తాటాకిల్లు దగ్ధం కాగా మూడు కుటుంబాలు వారు నిరాశ్రయులయ్యారు. వక్కలంక చెరువుగట్టు సమీపంలో గురువారం రాత్రి గ్యాస్‌సిలిండర్ లీకై ముక్కామల సూర్యకాంతం ఇంటికి మంటలు వ్యాపించాయి. పక్కనే ఉన్న కేశనకుర్తి లక్ష్మి తాటాకిల్లు అగ్నికి ఆహుతైంది. రూ.5లక్షలకు పైగా ఆస్తి నష్టం ఏర్పడినట్టు అంచనా వేస్తున్నారు. కేశనకుర్తి లక్ష్మి హైదరాబాద్‌లో బంధువుల ఇంటికి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. సూర్యకాంతానికి చెందిన రూ.54వేల నగదు, బంగారం, గృహోపకరణ వస్తువులు, ఇతర సామగ్రి కాలి బూడదయ్యాయి. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది కేవీ కొండబాబు ఆధ్వర్యంలో మంటలను అదుపుచేశారు. బాధిత కుటుంబానికి అమలాపురం తాలుకా రజక సంఘం రూ.2వేలు వంతున, గంగలకుర్రు రజక సంఘం రూ.1000 వంతున అందించారు. ప్రమాద ప్రాంతాన్ని ఇన్‌చార్జి తహశీల్దారు వెంకటేశ్వరరావు, సర్పంచ్ వాసంశెట్టి రేవతిలు పరామర్శించారు. పద్మాజీ టవర్స్ అధినేత మైపాల తాతాజీ సమకూర్చిన 25కేజీల బియ్యం, నిత్యావసర వస్తువలను ఎమ్మెల్యే సత్యనారాయణ అందించారు.

**బాధిత కుటుంబాలను ఆదుకుంటాం**

అగ్నిప్రమాద బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం బాధితులను ఆయన పరామర్శించారు. తక్షణ సాయం కింద బియ్యం, నిత్యావసర వస్తువులను అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. సర్పంచ్ వాసంశెట్టి రేవతి, ఎంపీటీసీ పిల్లి సత్యవేణి, కూటమి నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, మైపాల తాతాజీ, యనమదల రాజబాబు, పితాని శ్రీనివాస్, గుడాల ఫణి, నేదునూరి కల్యాణ్, దొమ్మేటి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### విద్యానిధిలో శ్రీరామనవమి వేడుకలు

అమలాపురం టౌన్, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): అమలాపురం విద్యానిధి పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాల చైర్మన్ ఏబీ నాయుడు, కరస్పాండెంట్ ఎ.శ్యామల ఆధ్వర్యంలో శ్రీరామనవమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సీతారాములు, లక్ష్మణుడు, హనుమంతుని వేషధారణలతో రూపొందించిన ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### మద్యం షాపును తక్షణమే తొలగించాలి

అంబాజీపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మాచవరం గ్యాస్‌కంపెనీ సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం షాపును తక్షణం తొలగించాలని ఎక్సైజ్ డీఎస్పీ కార్యాలయం ముందు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మద్యం షాపును తక్షణమే ఇక్కడ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మద్యం షాపును తక్షణం తొలగించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వరకాలనీ, కుసుమవారిపేటకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

### జనసేన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

అల్లవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బెండమూర్లంక గ్రామంలో జనసేన నాయకుడు గుర్రం కృష్ణ ఆధ్వర్యంలో అమలాపురం కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కిమ్స్ చైర్మన్ కేవీ సత్యనారాయణరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కిమ్స్ వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. యాళ్ల కాసు బాబు, లింగం చిన్నీ, గుర్రం రత్నప్రసాద్, గుర్రం రాజీవ్, ఈలి వెంకట్, చవ్వాకుల సతీష్, ముత్యాల రాజు, యాళ్ల బాబి, కొణిదెల వీరబాబు, చెరుకూరి సాయి, సంతోష్, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

### బాధ్యతగా పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు

అల్లవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఓర్పు, సహనంతో పాటు బాధ్యతగా పనిచేసే ఉద్యోగులకు చిరకాలం గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. బదిలీ అయిన ఉపాధి హామీ ఏపీవో వి.శ్రీనుబాబు, కంప్యూటర్ ఆపరేటర్లు సాధనాల నాగేశ్వరరావు, యాళ్ల లక్ష్మిలను ఘనంగా సన్మానించారు. ఉపాధి హామీ పథకంలో మండలానికి గుర్తింపు తెచ్చిన ఏపీవోను పలువురు అభినందించారు. వైస్ఎంపీపీ ముత్యాల రామకృష్ణ, సర్పంచ్‌లు దాకారపు చిరంజీవిరావు, సాధనాల వెంకట్రావు, ఫీల్డు అసిస్టెంట్‌లు రాజాజీ, జి.ఏడుకొండలు, బొంతు శ్యామ్‌ప్రసాద్, ఎస్.శ్రీనివాస్, గెద్దాడ ప్రసాద్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ బడిబాట.. బంగారుబాట కార్యక్రమం

అంతర్వేది, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అంతర్వేదిదేవస్థానం గ్రామంలో ఎంఈవో డి.కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడిబాట-బంగారుబాట కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. దేవస్థానం గ్రామంలో మోడల్ ప్రైమరీ స్కూలులో పిల్లలను చేర్పేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి బడిబాట-బంగారుబాట ప్రచార కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులతో కలిసి చేపట్టారు. బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పాలంటూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, ఏఎంసీ చైర్మన్ చింతా చిన్నా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఒగ్గు వరలక్ష్మి, పిచ్చిక శ్రీవిద్య, అంగన్‌వాడీ టీచరు వెంకటలక్ష్మి, సీఆర్ఎంటీ బుంగ కిశోర్ పాల్గొన్నారు.

### పార్టీలకతీతంగా ప్రజాసేవ చేయాలి

అయినవిల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో జరిగే పనులు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియపరచాలన్నారు. బడ్జెట్‌లో పనులు సరిగా పేర్కొనకపోవడంతో కొందరు ఎంపీటీసీలు ప్రశ్నించారు. గతంలో ఆమోదం లేకపోవడంతో తిరిగి అదే బడ్జెట్ రూ.29,400 మిగులు బడ్జెట్ ఆమోదించారు. సమావేశంలో ఎంపీడీవో జి.భీమారావు, పంచాయతీ విస్తరణాధికారి వాణిబెహరా, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

### 'ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలుచేసేందుకే వైసీపీ కుట్ర'

ఐ.పోలవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మరణాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో అశాంతిని రేకెత్తించేందుకు వైసీపీ కుట్ర చేస్తోందని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు(బాలు) ఆరోపించారు. మురమళ్ళ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఎస్సీ సెల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రైస్తవుల ముసుగులో వైసీపీ కార్యకర్తలు ప్రవీణ్ మరణాన్ని రాజకీయం చేస్తున్నారని అన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు.

### కొండాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

ముమ్మిడివరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని కొండాలమ్మతల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు జరిపించారు. అమ్మవారి జాతర మహోత్సవాలు గత నెల 30వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. జాతర మహోత్సవాల్లో భాగంగా రోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు జరిపించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ, ఫ్లోర్‌లీగల్ ములపర్తి బాలకృష్ణ, కడలి నాగు, కాకి మాణిక్యం, ఆలయ కమిటీచైర్మన్ పెట్టా శివప్రసాద్, దాట్ల బాబు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

### 8న ఇంటర్వ్యూలు

ముమ్మిడివరం,ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): స్వయంఉపాధి పథకం, చేతివృత్తుల పనివారల రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారికి మంగళవారం మధ్యాహ్నం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బ్యాంకు ప్రతినిధులతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ శుక్రవారం తెలిపారు. బీసీ, కాపు, ఈబీసీ తరగతులవారికి యూనిట్లు, గ్రూపుయూనిట్ల మంజూరుకుఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

### సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

మామిడికుదురు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా అందిస్తున్న సబ్సిడీ రుణాలకు 7,8 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు తెలిపారు. 7వ తేదీ 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరవాక, గోగన్నమఠం, లూటుకుర్రు, ఆదుర్రు, కొమరాడ గ్రామాలకు చెందినవారికి, మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకు మగటపల్లి, మాకనపాలెం, గెద్దాడ, ఈదరాడ గ్రామాలకు చెందినవారికి, 8వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మామిడికుదురు, మొగలికుదురు, నగరం, పాశర్లపూడి గ్రామాలవారికి, మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు అప్పనపల్లి, బి.దొడ్డవరం, పాశర్లపూడిలంక, పెదపట్నం, పెదపట్నంలంక గ్రామాలకు వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. లబ్ధిదారులు ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

### ట్యాంకర్ ద్వారా తాగునీరందించిన సర్పంచ్



ట్యాంకర్ ద్వారా తాగునీరందిస్తున్న సర్పంచ్ కుంచే బుల్లియ్య

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గోపవరం పంచాయతీ పరిధిలో బెస్తాయిపేట, రావులమ్మచెరువుగట్టు ప్రజల తాగునీటి ఇబ్బందిని సర్పంచ్ కుంచే బుల్లియ్య(బాబాయ్) గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశారు. పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. దీనితో శివారు ప్రాంతాల మహిళలు సర్పంచ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలబాలాజీ, కుంచే స్వామి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సదుపాయాలు

మామిడికుదురు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అనేక సదుపాయాలున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరాలని కోరుతూ గోగన్నమఠం గ్రామంలో శుక్రవారం ఎంఈవో ఎం.వెంకన్నబాబు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం స్కూలులో విద్యార్థుల కోసం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. సర్పంచ్ అల్లు విజయలక్ష్మి, హెచ్ఎం భావిశెట్టి నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యార్థుల చేరిక కోసం ప్రత్యేక డ్రైవ్

మలికిపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గూడపల్లి మెయిన్ కేవీ మెరక ప్రాథమికోన్నత పాఠశాల హైస్కూలుగా అప్‌గ్రేడ్ అవుతున్న సందర్భంగా పాఠశాలలో విద్యార్థులను చేర్చుకునేందుకు గ్రామస్తులతో కలిసి ఉపాధ్యాయ బృందం ఎన్‌రోల్మెంట్ డ్రైవ్‌ను శుక్రవారం నిర్వహించారు. గూడపల్లి, గొల్లమందలవారి గ్రూపు, కృష్ణరాజు కాలనీల్లో తిరిగి పిల్లలను హైస్కూల్‌లో చేర్పాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందర బ్రహ్మయ్య, కటికిరెడ్డి సత్యనారాయణ, ఎస్.బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### గోవిందుడు పెళ్లి కొడుకాయెనే..



అమలాపురం టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేశారు. సుదర్శనం మురళీకృష్ణమాచార్యుల ఆచార్య బ్రహ్మత్వంలో అలివేలు మంగతాయారు, బీబీనాంచారిలను పెండ్లి కుమార్తెలుగాను, స్వామివారిని పెండ్లి కుమారుడిగాను శాస్త్రోక్తంగా చేశారు. మహిళలు పసుపు కొట్టారు. ఇండుగులు శ్రీనివాసరావు ఇంటి వద్ద ఎదురు సన్నాహం నిర్వహించారు. ఆలయ ఈవో యర్రా వెంకటేశ్వరరావు, ఉత్సవకమిటీ చైర్మన్ జంగా అబ్బాయివెంకన్న, సభ్యులు కుంచే వెంకన్నబాబు, పీబీవీఎల్ఎన్ ఆచార్యులు, గోకరకొండ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

### మట్టి లారీలు స్వాధీనం

పి.గన్నవరం, మార్చి4(ఆంధ్రజ్యోతి): మానేపల్లి గ్రామపరిధిలో కందాలపాలెం ర్యాంపు నుంచి పి.గన్నవరం వైపు బిల్లులు లేకుండా తరలిస్తున్న రెండు తువ్వమట్టి లారీలను శక్రవారం మైన్స్‌అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లారీలను స్థానిక పోలీసులకు అప్పగించారు. ఉడిమూడిలో జరుగుతున్న మట్టి తవ్వకాలను మైన్స్‌అధికారులు పరిశీలించినట్టు తెలిసింది. మైన్స్ ఆర్ఐ వి.సుజాత, టెక్నికల్‌అసిస్టెంట్ రెహమాన్‌అలీ పాల్గొన్నారు.

**కందాలపాలెం ర్యాంపులో నిరసన**

కందాలపాలెం ర్యాంపు వద్ద పలువురు స్థానికులు తువ్వ మట్టి లారీలను అడ్డుకుని తవ్వకాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని వారు మండిపడ్డారు. ఎస్ఐ బి.శివకృష్ణ అక్కడకు చేరుకుని సమస్యలుంటే అధికారులకు విన్నవించాలని కోరారు. నిరసనకారులు బాటకు మధ్యలో టెంట్ వేసే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకుని వారిని అక్కడ నుంచి పంపించివేశారు.

### ఫోన్ బ్లాక్ చేయించాడని రౌడీషీటర్ దాడి

అమలాపురం రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఫోన్ బ్లాక్ చేయించాడని ఒక రౌడీషీటర్ మరో రౌడీషీటర్‌పై దాడిచేసిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ పి.వీరబాబు శుక్రవారం తెలిపారు. అమలాపురం మండలం చర్చిపేటలో ఈఘటన చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన రౌడీషీటర్ కంచిపల్లి శ్రీను మరో రౌడీషీటర్ అయిన పతివాడ నాగేంద్రను హైదరాబాద్‌కు చెందిన ఒక మిత్రుడికి పరిచయం చేశాడు. దాంతో నాగేంద్ర తరచూ హైదరాబాద్‌లోని మిత్రుడికి ఫోన్‌చేసి ఫోన్‌పేలో సొమ్ములు వేయాలని తరచూ వేదింపులకు గురిచేస్తున్నాడు. దాంతో హైదరాబాద్‌లోని మిత్రుడు రౌడీషీటర్ అయిన శ్రీనుకు ఫోన్‌చేసి నాగేంద్ర తరచూ సొమ్ముల కోసం ఫోన్ చేస్తున్నాడని, ఇది పద్ధతి కాదని చెప్పడంతో నాగేంద్ర ఫోన్‌ను బ్లాక్ చేసుకోమని సలహా ఇచ్చాడు. దాంతో ఫోన్ బ్లాక్ చేయించాడన్న కోపంతో నాగేంద్ర కంచిపల్లి శ్రీనుపై చర్చిపేట వద్ద దాడిచేసి గాయపరిచాడు. నాగేంద్రపై కేసు నమోదుచేసినట్టు సీఐ తెలిపారు.

### రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

అయినవిల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం అయినవిల్లిలో రైతులకు సబ్సిడీపై పవర్ టిల్లర్లను పంపిణీ చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం వ్యవసాయ రంగంలో యాంత్రీకరణకు సబ్సిడీపై యంత్రాలు అందిస్తుందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, జనసేన మండలాధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, సర్పంచ్ కాకర శ్రీనివాస్, మేడిద దుర్గాప్రసాద్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కాకర శ్రీనివాస్, గుర్రాల రాంబాబు, సలాది బుచ్చిరాజా, ఎంపీడీవో జి.భీమారావు, వ్యవసాయాధికారి వై.శోభ పాల్గొన్నారు.

### విద్యతోనే విశిష్ట గుర్తింపు

మామిడికుదురు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యలో రాణించడం ద్వారానే విశిష్ట గుర్తింపు లభిస్తుందని ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబులు పేర్కొన్నారు. నగరంలోని సాయిదీప్తి స్కూలు వార్షికోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో ఎంఈవోలు పాల్గొని మాట్లాడుతూ గ్రామీణస్థాయిలో కేజీ నుంచి పీజీ వరకు విద్యను అందిస్తున్న కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణను అభినందించారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. విద్యార్థినీ విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ, స్కూలు ప్రిన్సిపాల్ శివ, ప్రధానోపాధ్యాయిని వైష్ణవి, వై.నాగన్నబాబు పాల్గొన్నారు.

## రాయవరంలో వైభవంగా వెంకన్న కల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాయవరం, ఏప్రిల్ 4 (ఆంధ్ర జ్యోతి): రాయవరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి, అమ్మవార్ల దివ్యకల్యాణాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చైత్రమాసం మృగశిర నక్షత్రాన్ని పురస్కరించుకుని భక్తసంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, సుప్రభాత సేవ, అర్చనలు, తిరుమంజనం గావించారు. సుమారు 300 మంది దంపతులు స్వామివారి కల్యాణ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. పెద్దింటి కృష్ణమాచార్యులు, అంగర అయ్యామాచార్యులు, లక్ష్మీనారాయణాచార్యులు, పెద్దింటి ఫణి, అంగర జనార్ధనాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

## వెదురుపాకలో కంటి వైద్యశిబిరం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాయవరం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వెదురుపాక జనార్ధనస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం కాపు యూనిటీ సంఘం ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కరపకు చెందిన విజన్ ప్రాథమిక కంటి పరీక్షా కేంద్రం ఆప్తమాలజిస్టులు ఉమా మహేశ్వరి, కూన సాయి కిరణ్, కొల్లి ఉమామహేశ్వరరావు పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వెదురుపాక, రాయవరం, నదురుబాద, కొంకుదురు పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 35 మందికి కళ్లద్దాలు అందజేయగా, 15 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. కాపు యూనిటీ సభ్యులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు


దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో కీర్తి స్పందన

రాయవరం, ఏప్రిల్ 4 (ఆంధ్ర జ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వివిధ కార్పొరేషన్ల రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో ఎన్. కీర్తి స్పందన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు. 12 గ్రామాల పరిధిలో 718 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీ ఆర్డీ శ్రీనివాసరావు, అధికారులు, అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

### 7న కే. గంగవరంలో..

కె.గంగవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఓసీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ రుణాలకు ఈనెల 7 బ్యాంకర్లతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎన్. శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం, మండల వనరుల కేంద్రం, ఐకేపీ భవనం నాలుగు చోట్ల విడిగా ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. ఆయా గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులు వారికి కేటాయించిన కార్యాలయాల్లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఆధార్, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రము, బ్యాంక ఖాతా పుస్తకం ఒరిజన్‌లతో హాజరుకావాలని సూచించారు.


గంగవరంలో భూమిపూజ చేస్తున్న దృశ్యం

### ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కె.గంగవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కె.గంగవరంలో భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. గతంలో రేకుల షెడ్డులో ఈ ఆలయం ఉండేది. ఇప్పుడు దాతల సాయంతో నూతన ఆలయాన్ని నిర్మించడానికి గ్రామస్థులు ముందుకు వచ్చారు. ఈ మేరకు విరాళాలు సేకరిస్తున్నారు.

## సాదాసీదాగా మండల సమావేశం


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

కె.గంగవరం, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సమావేశం సాదాసీదాగా జరిగింది. ఇందులో ప్రధానంగా దంగేరు జగనన్న కాలనీలో వేయని రోడ్లుకు బిల్లులు తీసుకున్నారని దంగేరు ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్ అధికారులను నిలదీశారు. ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షత వహించారు. ఇందులో గృహనిర్మాణ శాఖ ఏఈ భీమశంకరం తమ శాఖ ప్రగతిని వివరిస్తున్న సమయంలో ఎంపీటీసీ లక్ష్మణ్ తన గ్రామంలో జరిగిన అవినీతి గురించి ప్రస్తావించి ఆవేదన వ్యక్తంచేశారు. దంగేరులో ఆరు ఎకరాల్లో జగనన్న లేఅవుట్ వేశారు. ఇంటింటికీ తిరిగి 165 మంది ఇళ్లు కట్టుకునేలా చేశాము. కాలనీలో రహదారులు వేయకుండా బిల్లులు చేసుకున్నారు. ఈ సమస్య గురించి ఎన్నిసార్లు అడిగినా పరిష్కారం కావడం లేదు. జగనన్న కాలనీలో అసంతృప్తిగా ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తమ గ్రా మాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని కూళ్ల సర్పంచ్ చిల్లి నాగేశ్వరరావు, యర్ర పోత వరం సర్పంచ్ పిల్లి రాంబాబులు డిమాండ్ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాహుల్ మాట్లా డుతూ జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పను లు గురించి వివరించారు. అత్యవసరంగా తాగునీటి అవసరాల కోసం మండల పరిషత్ నుంచి రూ. రెండు లక్షల నిధులు కేటాయిం చాలని కోరామని చెప్పారు. దీనికి ఎంపీపీ నాగమణి సముఖత వ్యక్తం చేశారు. అనంతరం ఆమె శాఖల వారీ సమీక్ష చేశారు. వ్యవసా యశాఖ ఏవో బలుసు రవి మాట్లాడుతూ వ్యవసాయ యాత్రీకరణలో భాగంగా సబ్సిడీపై 10 చిన్న ట్రాక్టర్‌లు, స్ప్రేయర్‌లు వచ్చినట్లు చెప్పారు. మండలంలో 26 గ్రామాలు ఉండగా 10 చిన్న ట్రాక్టర్లు మాత్రమే వస్తే ఎవరికి సరిపోతాయని సభ్యులు ప్రశ్నించారు. ఎక్కువ మొత్తం మంజూరయ్యేవిధంగా చూడాలని సూచించారు. జెడ్‌పీటీసీ ఓటిళినేని శ్రీవరలక్ష్మి, ఎంపీడీవో ఎన్. శ్రీనివాసు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్, వైఎస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

### నేడు రుణాలకు ఇంటర్వ్యూలు

మండపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలీ పరిధిలో గల బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ టీవీ రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులంతా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

### జేసీకి వినతిపత్రం

మండపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) పట్టణంలో గీత కార్మికులకు ప్రభుత్వం మంజూరు చేసిన మద్యం దుకాణాన్ని సప్తగిరి థియేటర్ ఎదురుగా ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మహిళలు శుక్రవారం జాయింట్ కలెక్టర్ నిశాంతిని కలిసి తమ గోడును వెలబుచ్చుకున్నారు. కేశవరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు వచ్చిన జేసీ వద్దకు టీడీపీకి చెందిన మాజీకౌన్సిలర్లు బండి గోవింద్, ఇబ్రహీం ఆధ్వర్యంలో 28,29,30 వార్డులకు చెందిన మహిళలు వచ్చి మద్యం దుకాణం వల్ల కలిగే ఇబ్బందుల గురించి వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. అలాగే ఉదయం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వ రరావును కలిశారు. వారిరువురూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు చెప్పారు.

### ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించాలి

రాయవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించాలని సమగ్రశిక్ష సీఎంవో బి.సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. శుక్రవారం వెదురుపాక ఇందిరమ్మ కాలనీలో ఎన్‌రోల్‌మ్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఎంఈవో -2 యర్రమాటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఎంవో పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఐదుగురు విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించారు. హైస్కూల్ హెచ్‌ఎం పి.రాంబాబు, ఇందిరమ్మ కాలనీ పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయుడు మేడిశెట్టి సత్యనారాయణ, నూలు నాగరాజు, సీఆర్పీ కుంచే నీనాసిరి పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన డీఆర్‌డీఏ పీడీ


వేగుళ్లను కలిసిన జిల్లా డీఆర్‌డీఏ నూతన పీడీ సాయినాథ్ జయచంద్ర

మండపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును శుక్రవారం జిల్లా డీఆర్‌డీఏ నూతన పీడీగా బాధ్యతలు స్వీకరించిన సాయినాథ్ జయచంద్ర పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వేగుళ్లను శాలువాతో సత్కరించి మొక్క అందజేశారు.

### మండపేట ఎస్ఐగా ఓంకార్

మండపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) మండపేట పట్టణ ఎస్ఐగా పి.ఓంకార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయవాడ వన్‌టౌన్ నుంచి బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ హరికోటి శాస్త్రి అయినవిల్లి పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ స్థానిక మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని చెప్పారు.

## గొల్లపుంత టిడ్కో కాలనీలో ...
## తాత్కాలికంగా శిబిరం ఏర్పాటు

● ఎప్పటికప్పుడు గృహనిర్మాణాలను పర్యవేక్షిస్తున్న టిడ్కో, మున్సిపల్ అధికారులు


మండపేట టిడ్కో గృహాల వద్ద విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు

మండపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 20వ వార్డులో గల గొల్లపుంత టిడ్కో కాలనీలో తాత్కాలికంగా మున్సిపల్ అధికారులు శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల ఆదేశాల మేరకు ఫేజ్ - 1లో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లకు సంబంధించి వేగవంతంగా అందించేందుకు అధికారులు చర్యలు పట్టారు. కాలనీలో ఏర్పాటు చేసిన టెంట్‌లోనే మున్సిపల్, టిడ్కో అధికారులు, సచివాలయ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఎంతమంది గృహప్రవేశాలు చేశారనే దానిపై నిశితంగా పరిశీలిస్తున్నారు. ఈనెల 7 కల్లా టిడ్కో గృహాలు ఫేజ్-1లో గృహప్రవేశాలు చేయాలని శుక్రవారం కమి షనర్ రంగారావు లబ్ధిదారులను కోరారు. శని, ఆదివారాల్లో కూడా తమ సిబ్బంది అందు బాటులో ఉంటారని ఆయన చెప్పారు. లబ్ధిదా రులు ఎట్టిపరిస్థితుల్లో కూడా తమకు కేటా యించిన గృహాలను పూర్తిచేసుకోవాలన్నారు. అలా చేయకుంటే ఇళ్లను రద్దుచేసి వేరే వారికి కమిటీ ఆదేశాల మేరకు అందిస్తామని ఆయన లబ్ధిదారులను హెచ్చరించారు.

### రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడిగా కామన


షర్మిల నుంచి నియామక పత్రం అందుకుంటున్న దృశ్యం

మండపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడిగా ఏడిదకు చెందిన కామన ప్రభాకరరావు నియమితులయ్యారు. ఈమేరకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేతుల మీదుగా శుక్రవారం నియామకపత్రం అందుకున్నారు. ఈయనతో పాటు పార్టీ నాయకులు రాజనాల రామ మోహనరావు, సరహారశెట్టి నరసింహారావు, వడ్డినాగేశ్వరరావు, మీసాల బాబీ, కేవీ సుబ్బారావు, తదితరులు వున్నారు.

## భూ సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం


రామచంద్రపురం మండల సమావేశ దృశ్యం

» రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అర్జీలను పూర్తిగా ఆన్‌లైన్ చేయని అధికారులు
» మండల పరిషత్ సభ్యుల ఆగ్రహం
» రామచంద్రపురం మండల సర్వసభ్య సమావేశం

ద్రాక్షారామ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలపై స్వీకరించిన అర్జీలు ఆన్‌లైన్ చేయకపోవడం, పరిష్కారంపై సభ్యులు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను నిలదీశారు. రామచంద్రపురం మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ అంబటి భవానీ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. కాపవరం ఎంపీటీసీ రెడ్డం సతీష్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో తాను భూమి నిషేధిత జాబితాలో ఉంచడంపై దరఖాస్తు చేసుకోగా ఉన్నతాధికారులకు పంపి పరిష్కరించినట్టు ఆన్‌లైన్‌లో చూపడంపై ప్రశ్నించారు. వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారం మాట్లాడుతూ రెవెనూ సదస్సులో ఎన్ని దరఖాస్తులు వచ్చాయని ప్రశ్నించారు. 190 దరఖాస్తులు వచ్చాయని ఆర్ఐ సమాధానమివ్వగా వేగాయమ్మపేటలోనే 160 దరఖాస్తులు వచ్చాయన్నారు. మండలం మొత్తంగా రెండు వేలకు పైగా దరఖాస్తులు వస్తే ఆన్‌లైన్ చేయకుండా వదిలివేశారని రెవెన్యూ అధికారులపై మండిపడ్డారు. వేగాయమ్మపేటలో 19దరఖాస్తులు వచ్చినట్లు ఆన్‌లైన్‌లో చూపుతున్నారని వచ్చిన దరఖాస్తులు ఆన్‌లైన్ చేయకుండా ఎలా పరిష్కరిస్తారన్నారు. రెడ్డం సతీష్ మాట్లాడుతూ పంచాయతీల్లో తడి చెత్త, పొడి చెత్త సేకరణ, వేరు చేయడం వంటి పనులకు నిధులు సరిపోవడం లేదన్నారు. ప్రభుత్వం మరోవిధంగా సహకరించాలన్నారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థలకు పైస్థాయిలో పారిశుధ్య పరికరాలు కొనుగోలు చేసి పంపారని, కూటమి ప్రభుత్వం కూడా అలాగే చేస్తోందన్నారు. పంచాయతీల అవసరాల మేరకు కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపికకు ఒక రోజే ఇంటర్వ్యూలు నిర్వహించడంపై సతీష్ ప్రశ్నించారు. 1100 మందికి పైగా హాజరుకాలేకపోయారని వారికి మరోసారి ఇంటర్వ్యూలు జరపాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక ఎలా జరుగుతుందీ అందరికీ తెలిసిందేనని కనీసం ఇంటర్వ్యూలైనా సక్రమంగా నిర్వహించాలన్నారు. వాస్తవంగా యూనిట్లు ఏర్పాటు చేసుకున్న వారికి రుణాలు ఇవ్వాలని డిమాండు చేశారు. బయటి వ్యక్తులు సమావేశంలో ప్రశ్నించవద్దని ఎంపీడీవో కె.పద్మజ్యోతి.. సర్పంచ్ భర్త ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు శాకా బాబి, నరాల రాజ్యలక్ష్మి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు


ఆలమూరులో ఇంటర్వ్యూలు జరుగుతున్న దృశ్యం

ఆలమూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలో కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికకు శుక్రవారం రెండో రోజు ఇంటర్వ్యూలు జరిగాయి. ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజు అధ్యక్షతన లబ్ధిదారుల దరఖాస్తులను, సర్టిఫికెట్లను పరిశీలించారు. లబ్ధిదారుడి యూనిట్ ఏర్పాటుపై బ్యాంక్ అధికారులతో చర్చించారు. మడికి, చొప్పెల్ల, చెముడులంక, బడుగువానిలంక, నర్సిపూడి, పెనికేరు, మూలస్థానం, జొన్నాడ గ్రామాల నుంచి కార్పొరేషన్ రాయితీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న 378మందికి ఇంటర్వ్యూలు నిర్వహించాలసి ఉండగా 288మంది హాజరైనట్లు ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలలో మడికి ఎస్‌బిఐ, ఆలమూరు యూనియన్‌బ్యాంక్, నర్సిపూడి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజరులు పాల్గొన్నారు.

**ఆత్రేయపురం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కాపు, బీసీ, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి వివిధ గ్రామాల నుంచి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఎంపీడీవో వెంటరామన్, బ్యాంకు మేనేజర్లు ముఖాముఖి నిర్వహించారు. 285 మంది దరఖాస్తు చేసుకోగా 195 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీవో తెలిపారు. ఏవో రామస్వరూప్, సిబ్బంది పాల్గొన్నారు.


ఆత్రేయపురంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

## ఆలయాల్లో అభివృద్ధి పనులకు ప్రణాళికలు


ర్యాలీలో నగర మహాలక్ష్మి ఆలయం వద్ద దేవదాయ ఇంజనీర్ల బృందం

ఆత్రేయపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు-2027లో భాగంగా పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం దేవదాయ శాఖ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ పలు ఆలయాలను సందర్శించారు. రానున్న పుష్కరాలను దృష్ట్యా నియోజకవర్గంలోని గ్రూప్ దేవాలయాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ర్యాలి ఉమా కమండలేశ్వరస్వామి ఆలయం సమయంతుల-మాతంశెట్టి అన్న దాన సత్రం, వాగ్దేవి, మహాలక్ష్మమ్మ ఆలయాలను సందర్శించారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఈవో బీహెచ్‌వీ రమణమూర్తితో చర్చించారు.

### 'నారాయణ'లో గ్రాడ్యుయేషన్ డే

రావులపాలెం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రావులపాలెం నారాయణ స్కూల్‌లో 5వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపల్ రమణబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు పి.రవికిరణ్, ఎస్.సాయికిరణ్ హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో అమలాపురం జోన్ ఏజీఎం శ్రీనివాసరెడ్డి, ఆర్అండ్‌డీ టీం అర్చన, సుస్మిత, ఆర్ఐ అప్పారెడ్డి, ఏవో వెంకటరెడ్డి, నవీన్, హరిత, వైస్ ప్రిన్సిపాల్ శైలజ, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

### బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కాండ్రేగుల



ఆలమూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆలమూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షుడిగా ఆలమూరుకు చెందిన కాండ్రేగుల భీమశంకరరావు, ఉపాధ్యక్షుడిగా ఎం.కృపావరం, కార్యదర్శిగా జి.రాజశేఖర్, ఉపకార్యదర్శిగా బిమహాలక్ష్మి, కోశాధికారిగా ఎ.గోవిందరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నిక అధికారి అంగర బిందుమాధవరావు ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన భీమశంకరరావుతో పాటు కార్యవర్గ సభ్యులను పలువురు న్యాయవాదులు, అధికారులు, నాయకులు అభినందించారు.

### ఆలమూరు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా వెంకటలక్ష్మి



ఆలమూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలిగా ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన కొత్తపల్లి వెంకటలక్ష్మిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలమూరు ఏఎంసీ చైర్మన్ పదవిని కూటమి ప్రభుత్వం ఒప్పందంలో భాగంగా జనసేన పార్టీకి కేటాయించారు. చైర్మన్ పదవి ఓసీ మహిళకు రిజర్వు చేయడంతో మడికి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కొత్తపల్లి వెంకటలక్ష్మిని ఎంపిక చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వెంకటలక్ష్మిని పలువురు అభినందించారు.

### 15 నుంచి కాలువల కట్టివేత

కొత్తపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇరిగేషన్ సర్కిల్ ధవళేశ్వరం వారి ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి కాలువల్లో నీటిసరఫరాను నిలిపివేస్తున్నట్టు ఇరిగేషన్ ఏఈ నవీన్ తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని మంచినీటి చెరువులు, పశువు, రజకుల చెరువులను ఈ నెల 15వ తేదీలోపు నింపుకోవాలని తెలిపారు. కాలువల్లో నీటిమట్టం సరిపడకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని పూర్తిస్థాయిలో నీటిని నింపుకునేలా చర్యలు చేపట్టుకోవాలని ఏఈ నవీన్ కోరారు.

### వికాస్ స్కూల్ వార్షికోత్సవం

రామచంద్రపురం (ద్రాక్షారామ), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో వికాస్ స్కూల్‌వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రతి పంచాయతీ వద్ద చలివేంద్రం

### డీపీవో శాంతలక్ష్మి


చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శాంతలక్ష్మి

ఆత్రేయపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయం, ముఖ్యకూడలిల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని జిల్లా పంచాయతీ అధికారిణి డి.శాంతలక్ష్మి సూచించారు. శుక్రవారం మండలంలోని ఉచ్చిలి, రాజవరం, పేరవరం, బొబ్బర్లంక గ్రామ పంచాయతీలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. తడిచెత్త, పొడిచెత్త సేకరించి సంపదను సృష్టించుకోవాలన్నారు. నిర్మాణం పూర్తిచేసుకున్న సంపద కేంద్రాలను మెరుగుపరుచుకోవాలన్నారు.ప్రతిరోజు పారిశుధ్య నిర్వహణ చర్యలు విధిగా చేపట్టాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరందించాలన్నారు. అనంతరం కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

## నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ వెబ్‌నార్

రావులపాలెం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రావులపాలెం జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ కన్వీనర్లు కె.రజని, డాక్టర్ యు.సుభాషిణి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్, పెటెంట్స్ డిజైన్ ఫిల్లింగ్ అంశంపై జాతీయ స్థాయి వెబ్‌నార్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ అంశానికి సంబంధించి ప్రత్యేక స్పీకర్‌గా కుమార్‌రాజు అసిస్టెంట్ కంట్రోలర్ పేటెంట్స్ అండ్ డిజైన్ రాజీవ్‌గాంధీ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ నాగపూర్ వారు వ్యవహరిస్తారన్నారు. ఈ వెబ్‌నార్‌ను యువకులు, విద్యార్థులు, ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు, విద్యావంతులు, ఆన్‌లైన్‌లో ఉపయోగించుకోవాలన్నారు. వివరాలకు కళాశాల వెబ్‌సైటు లేదా 80747 34412, 94932 82966కు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్‌కుమార్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

## వెంకన్న ఆలయంలో అష్టోత్తర పూజలు


వెంకన్న ఆలయంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 4(అంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన వారు అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,50,949 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అలాగే వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి దేవరపల్లికి చెందిన మల్లిపూడి సురేష్- వెంకటలక్ష్మి దంపతులు రూ.73,506 విరాళం సమర్పించారు. కోరిన కోర్కెలు నెరవేరడంతో భక్తులు స్వామివారి ఆలయంలో మోకాళ్ల ప్రదర్శన నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

## రామచంద్రపురంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



రామచంద్రపురం (ద్రాక్షారామ), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలో రూ16.53 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ అయ్యప్పనాయుడు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం శంకుస్థాపన చేశారు. వెల్ల తాగునీటి పథకం ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు ముఖద్వారం గేటు, ఇతర మరమ్మతులు, రెండో వార్డు స్టీల్‌వెల్‌పేట, 16వ వార్డు లలితానగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం, 9వ వార్డు శాంతినగర్‌లో సీసీ డ్రైను నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం, మున్సిపల్ సాధారణ నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ శ్రీకాంత్, ఏఈలు, టీడీపీ పట్టణాధ్యక్షుడు కడియాల రాఘవన్, కంచుమర్తి బాబూరావు, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.